PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 56 | విజయవాడ, మంగళవారం 26 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 26 September 2023 | Rs

యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మను, ఇతర అంగన్‌వాడీ ఉద్యోగులను నిర్బంధించిన పోలీసులు

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం

- వేలాది మంది అరెస్ట్
- కల్యాణ మండపాలు, ఏఆర్ గ్రౌండ్స్, పోలీస్ స్టేషన్లకు తరలింపు
- మద్దతుగా సిపిఎం రాస్తారోకో, రాష్ట్ర కార్యదర్శితో సహా పలువురి అరెస్టు.. అక్రమ కేసులు
- వామపక్ష పార్టీల ఖండన

అంగన్‌వాడీ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. రెండు రోజుల నుండే నోటీసులు, హౌస్ అరెస్ట్‌ల వంటి చర్యలను చేపట్టిన పోలీసులు సోమవారం నాడు విజయవాడ నగరమంతా మోహరించారు. సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన మహాధర్నాకు తరలివస్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్‌లతో పాటు నగరంలోని అన్ని కీలక ప్రాంతాల్లోనూ పోలీసుల నిఘా కనిపించింది. అయినా, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి), ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) ఆధ్వర్యాన అడ్డంకులను అధిగమించి వేలాదిమంది అంగన్‌వాడీలు విజయవాడకు చేరుకున్నారు. విడివిడిగా, బృందాలుగా, చిన్న ప్రదర్శనలుగా ధర్నా చౌక్‌కు తరలివెళ్లే ప్రయత్నం చేశారు. వీరిని ఎక్కడివారిని అక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఒక్క విజయవాడ నగరంలోనే 3,500 మందిని అరెస్ట్ చేశారు. పోలీసు స్టేషన్లు, కళ్యాణమండలపాల్లో నిర్బంధించారు. వీరికి మద్దతుగా సిపిఎం రాస్తారోకో చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు రోడ్డుపై బైఠాయించారు. వారిని పోలీసులు అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

'బాధ్యతగల రాజకీయ పార్టీగా ఇలాంటి అమానుషమైన అరెస్ట్‌లకు స్పందించకపోవడం సరైనది కాదని భావించి, నిరసన తెలియచేయాలని నిర్ణయించాం. ఇప్పటికైనా ప్రజాస్వామ్యస్ఫూర్తితో ముఖ్యమంత్రి అంగన్‌వాడీలతో చర్చలు జరపాలి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఈ ఉద్యమం మరింత తీవ్రతరమౌతుంది'.

వి. శ్రీనివాసరావు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

అక్రమ కేసులు

అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని నిరసిస్తూ రాస్తారోకో చేసిన సిపిఎం నాయకులపై ఐపిసి 143,188,341 రీడ్ విత్ 149, పోలీస్ యాక్ట్ సెక్షన్ 32ల కింద పోలీసులు అక్రమకేసులు పెట్టారు. 300/23 క్రైమ్ నెంబర్‌తో కేసు నమోదు చేశారు.

వి శ్రీనివాసరావు, బాబూరావు తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మరిన్ని వార్తలు లోపలి పేజీల్లో

అమరావతిని నీరుగార్చారు

- 2019 నుండి బడ్జెట్ సహకారం లేదు
- అభివృద్ధి ప్రణాళికలో అనిశ్చితి
- సర్కారును తప్పు పట్టిన కాగ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాజధాని అమరావతి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాగ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. భూ సమీకరణ కోసం చేసిన వేల కోట్ల రూపాయల ఖర్చు నిరుపయోగంగా మారిందని, ఇప్పటికే వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు నిష్ఫలంగా మారాయని పేర్కొంది ఈ మేరకు కాగ్ రూపొందించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు శాసనసభలో ప్రవేశపెట్టింది. '2019నుండి అమరావతికి బడ్జెట్ సహకారం లేదు' అని ఈ నివేదికలో కాగ్ నిర్ధారించింది. 'రాజధాని నగర అభివృద్ధిపై విధానపరమైన మార్పు కారణంగా 55 ప్యాకేజిలపై అనిశ్చితి నెలకొంది' అని పేర్కొంది. 2019 నుంచి నిర్ణయించిన ప్రణాళిక కోసం కనీసం బడ్జెట్ సహకారం అందించేందుకు కూడా ప్రయత్నం జరగలేదని కాగ్ పేర్కొంది. 33,476 కోట్లు రుణంగా సమీకరించుకోవాల్సి ఉండగా, కేవలం 8,540 కోట్లు మాత్రమే సమీకరించుకు న్నారని పేర్కొంది. ప్రభుత్వ విధానం మారిన ఫలితంగా 2019 నుంచి కాలపరిమితి లేకుండా ఉన్న 55 ప్యాకేజిల ఒప్పందాలపై అనిశ్చితి నెలకొందని వ్యాఖ్యానించింది. ఈ 55 ప్యాకేజి పనులు పూర్తి చేసేందుకు 28,048 కోట్లు కావాల్సి ఉందని పేర్కొంది. వీటి భూసమీకరణకు 2,245 కోట్ల రూపాయలు సిఆర్‌డిఎ వ్యయం చేసిందని, ఇలా సేకరించిన భూమి అంతా నిరుపయోగంగా పడి ఉందని విమర్శించింది. సమీకరించిన భూమిలో మౌళికాభివృద్ధి కోసం రూ.13,803 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం 183 కోట్లు మాత్రమే అక్టోబర్ 2021 వరకు ఖర్చు చేసినట్లు గుర్తించినట్లు కాగ్ వెల్లడించింది. దీంతో 2021 సెప్టెంబర్ వరకు 16 ప్యాకేజిల్లో నాలుగు ప్యాకేజిల్లో కేవలం 10 నుంచి 18 శాతం పురోగతి ఉన్నట్లు పేరొక్కంది. మరో 12 ప్యాకేజిలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని పేర్కొంది.

నిధుల వ్యయంచేసినా...

అనేక ప్యాకేజిల్లో రూ. 3,213 కోట్లు వ్యయం చేసినా ఆ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని కాగ్ ఆక్షేపించింది. మరో రూ. 270 కోట్లతో పైపులు కొనుగోలు చేసినా అవి నిరుపయోగంగా పడి ఉన్నాయని, దీంతో ఆ వ్యయం నిష్ఫలమైందని కాగ్ ఆక్షేపించింది. రహదారుల నిర్మాణంలోనూ నిష్ఫల వ్యయం కనిపించిందిని కాగ్ ఆరోపించింది. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న సీడ్ యాక్సెస్ రహదారిని భవిష్యత్తు ట్రాఫిక్‌కు అనుగుణంగా తొమ్మిది లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని భావించి విస్తరణ పనులు ప్రారంభించారని, అయితే భూసేకణ సమస్య కారణంగా 44 కోట్లు వ్యయం అనాలోచితంగా చేసినట్టయిందని కాగ్ పేర్కొంది. ప్రభుత్వ భవనాలకు సంబంధించి 19 ప్యాకేజిల్లో 6,848 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం రెండు ప్యాకేజిల్లో 527 కోట్లుతో పనులు పూర్తయ్యాయని, మిగిలిన 17 ప్యాకేజిల్లో 1,505 కోట్లు వ్యయం చేశారని, అవి పూర్తి కాలేదని కాగ్ పేర్కొంది.

అంతా సందిగ్ధమే

2019 నుంచి అన్ని ప్యాకేజిల పనులు నిలిచిపోవడంతో వాటి పురోగతిపై సందిగ్ధం నెలకొందని కాగ్ అభిప్రాయపడింది. ఫలితంగా అప్పటివరకు ఖర్చు చేసిన 1,505 కోట్ల రూపాయల నిధులు కూడా నిరుపయోగమయ్యాయని కాగ్ విమర్శించింది. అలాగే అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులకు 208 కోట్లుతో కొనుగోలు చేసిన సామగ్రి కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయని వ్యాఖ్యానించింది. మరికొన్ని పనుల్లో కూడా కోట్లాది రూపాయలు వృధాగా మారిపోయాయని కాగ్ ఆక్షేపించింది.2019 నుంచి నిర్ణయించిన ప్రణాళిక కోసం కనీసం బడ్జెట్ సహకారం అందించేందుకు కూడా ప్రయత్నించలేదని కాగ్ పేర్కొంది. 33,476 కోట్లు రుణంగా సమీకరించుకోవాల్సి ఉండగా, కేవలం 8,540 కోట్లు మాత్రమే సమీకరించుకు న్నారని పేర్కొంది.

ప్యాకేజిలపై అనిశ్చితి

అమరావతి రాజధాని నిర్మాణంలో ప్యాకేజిలపై ఇంకా అనిశ్చితి నెలకొందని పేర్కొంది. 2019 మిగతా 2లో

మండలిలో పిడిఎఫ్ పట్టు

- వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన ఛైర్మన్
- గ్రాట్యుటీపై కేంద్రానికి లేఖ : మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్రాట్యుటీ, పదవీ విరమణ ప్రయోజనాల గురించి ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి సోమవారం శాసన మండలి ఛైర్మన్ మోషన్ రాజుకు వాయిదా తీర్మానం అందజేసి చర్చకు పట్టుపట్టారు. ఈ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు ఛైర్మన్ ప్రకటించడంతో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.5లక్షల మంది వర్కర్లు, హెల్పర్లు ఉన్నారని తెలిపారు. వీరికి కనీస వేతనాలు లేవని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, పదవీ విరమణ ప్రయోజనాల కోసం సోమవారం చలో విజయవాడకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. వీరి డిమాండ్లను పట్టించుకోకుండా తీవ్రమైన నిర్బంధం అమలు చేయడం తగదన్నారు. రాజ్యాంగం ఇచ్చిన నిరసన వ్యక్తం చేసే అవకాశం కూడా ఇవ్వకుండా ఎక్కడికక్కడ రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు చేయడం దారుణమని అన్నారు. డిమాండ్లు పరిష్కరించాలని, నిర్బంధాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. చర్చకు ఛైర్మన్ అంగీకరించక పోవడంతో నిరసన వ్యక్తం చేస్తూ ఛైర్మన్ పోడియంను ముట్టడించారు. మంగళవారం మరో పద్ధతిలో చర్చకు మిగతా 2లో

క్రికెట్‌లో స్వర్ణం

- మహిళా జట్టు నయా చరిత్ర
- ఫైనల్లో శ్రీలంకపై భారత్ ఘన విజయం

6

ఎన్డీయేకి అన్నాడిఎంకె రాంరాం

చెన్నై : బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) నుంచి వైదొలుగుతున్నట్లు ఎఐఎడిఎంకె సోమవారం ప్రకటించింది. అలాగే బిజెపితో బంధాన్ని తెంచుకుంటున్నట్లు కూడా ప్రకటించింది. చెన్నైలో జరిగిన పార్టీ జిల్లా కార్యదర్శులు, ప్రధాన కార్యాలయ కార్యదర్శులు, ఎంపిలు, ఎమ్మెల్యేల సమావేశం ముగింపులో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.

ప్రధాన కార్యదర్శి ఇకె పళినిస్వామి అధ్యక్షతన ఈ సమావేశం సుమారు గంట సేపు జరిగింది. ముగింపు తరువాత పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెపి మునుసామి విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సర కాలం నుంచి బిజెపి రాష్ట్ర నాయకత్వం ఉద్దేశపూర్వకంగా, ఒక పథకం ప్రకారం అన్నాదురై, జయలలిత వంటి నేతలపైన, పార్టీ విధానాలపైన విమర్శలకు దిగుతుందని ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమ పార్టీ కొత్త కూటమిని ఏర్పాటు చేస్తుందని మునుసామి ప్రకటించారు.

ప్రైవేట్ విశ్వవిద్యాలయాల బిల్లుకు ఓకే

ఆమోదించిన అసెంబ్లీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్టసవరణ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ సోమవారం ఆమోదించింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ బిల్లును ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది. గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రపంచంలో అత్యున్నత 100 విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో ఉమ్మడి సర్టిఫికెట్‌ను విద్యార్థులు పొందేలా చట్టసవరణ చేశారు. రాష్ట్రంలోని దేవాదాయశాఖకు చెందిన భూములు వార్షిక కౌలు చెల్లించకుండా సాగులో వున్నా, దేవాలయాల వద్ద ఉండే దుకాణాలకు సంబంధించి లైసెన్స్ కాలపరిమితి ముగిసినా, అలాగే వుంటే అలాంటి కేసులను ఆక్రమణదారులుగా గుర్తించి నాన్‌బెయిలబుల్ కేసులను పెట్టేలా చట్టసవరణ చేశారు. సోమవారం శాసనసభలో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఈ సవరణ బిలును ప్రవేశపెట్టగా, సభ ఆమోదించింది. రవాణాశాఖకు సంబంధించి మూడు టన్నుల బరువును తీసుకెళ్లే ఆటో, నాలుగు చక్రాల వాహనాలకు ఇప్పటిదాకా అమలులో వున్న జీవితకాలపు పన్ను విధానాన్ని రద్దు చేసి త్రైమాసిక పద్ధతిలోగాని, ఆరునెలలకోసారిగాని పన్నులను చెల్లించేలా చట్టసవరణను రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్ ప్రవేశపెట్టగా, సభ ఆమోదించింది.

ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారినందున వారు ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ ప్రకారం క్రమశిక్షణా చర్యలు వుండేలా చట్టసవరణ ప్రతిపాదనను మంత్రి పినిపె విశ్వరూప్ ప్రవేశపెట్టిన సవరణ బిల్లును సభ ఆమోదించింది. వస్తుసేవల పన్ను చట్టసవరణను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

జిపిఎస్ రద్దు కోరుతూ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

- ఒపిఎస్‌ను పునరుద్ధరించాలంటూ నినాదాలు

విద్యారంగం పరిరక్షణలో యుటిఎఫ్ కీలక పాత్ర

- స్వర్ణోత్సవ జాతాలో నాయకులు

3

కదంతొక్కిన కష్టజీవులు

- ఉపాధి, ఆహార, సామాజిక భద్రత కోసం కొల్‌కతాలో వ్యవసాయ కార్మిక సంఘం భారీ బహిరంగ సభ

5

అంత అర్జెంట్ ఏంటి!

- రేపు లిస్ట్‌లో పెట్టండి
- చంద్రబాబు పిటిషన్‌పై సుప్రీం చీఫ్ జస్టిస్

న్యూఢిల్లీ : నిబంధనల నుంచి మినహాయింపునిచ్చి లిస్టులో లేని తమ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాల్సిందిగా టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసుకున్న విన్నపాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అంత అత్యవసరమేంటని ప్రశ్నించిన ధర్మాసనం మంగళవారం నాడు లిస్టులో చేర్చాలని సూచించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తనపై నమోదైన ఎఫ్ఆర్‌లను కొట్టివేయాలంటూ చంద్రబాబు పెట్టుకున్న పిటిషన్ ను అత్యవసరంగా విచారించాలని ఆయన తరపు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోరారు. 'చంద్రబాబు కస్టడీతో రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని తొక్కేస్తున్నారని' పేర్కొంటూ ఈ కేసును అత్యవసరంగా చేపట్టాల్సి వుందని లూథ్రా పేర్కొన్నారు. చంద్రబాబును ఎప్పుడు అరెస్టు చేశారని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ప్రశ్నించగా, సెప్టెంబరు 8న అని లూథ్రా చెప్పారు. అటువంటపుడు ఈ రోజునే దీనిపై అత్యవసరంగా విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని ప్రధానన్యాయమూర్తి స్పష్టం చేశారు. మంగళవారం ఈ అంశాన్ని లిస్ట్‌లో పెట్టాల్సిందిగా లూథ్రాకు సూచించారు.

స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు

కాగా చంద్రబాబు తరుపున న్యాయవాది గుంటూరు ప్రమోద్ కుమార్ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేశారు. రాష్ట్రంలోని అతిపెద్ద ప్రతిపక్షాన్ని తొక్కిపట్టేందుకే పాలక ప్రభుత్వం ప్రతీకారంతో ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిందని ఎస్ఎల్‌పి పేర్కొంది. 21 మాసాల క్రితం నమోదైన కేసులో నాయుడు పేరును ఎఫ్ఐఆర్‌లో అకస్మాత్తుగా చేర్చి..అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. రాజకీయ కారణాలతోనే ఇవన్నీ జరిగాయని పేర్కొన్నారు.

చంద్రబాబు రిట్ నిరర్థకం : హైకోర్టు

విజయవాడలో ఎసిబి కోర్టులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో నిందితుడిగా తనను విచారించేందుకు రెండు రోజులపాటు సిఐడి కస్టడీకి ఇస్తూ ఎసిబి కోర్టు ఈ నెల 22న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ నిరర్థకమైనదిగా హైకోర్టు సోమవారం ప్రకటించింది. రెండు రోజుల పోలీస్ కస్టడీ ముగిసిన కారణంగా ఈ పిటిషన్ పరిష్కారమైనట్లుగా వెల్లడించింది. ఈ మేరకు జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు తరుపున ప్రమోద్‌దూబె వాదనలు వినిపించగా, సిఐడి తరుపున ఎఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, వివేకానంద కౌంటర్ దాఖలు చేశారు. చంద్రబాబును విచారించిన అంశాలను ఎసిబి కోర్టుకు సీల్డ్‌కవర్‌లో సిఐడి అందించింది.

నడ్డాతో బిధూరి భేటీ

న్యూఢిల్లీ : లోక్‌సభలో బిఎస్‌పి ఎంపి డానిష్ అలీపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్తంగా విమర్శలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి రమేష్ బిధూరి సోమవారం ఆ పార్టీ అధ్యక్షులు జెపి నడ్డాతో భేటీ అయ్యారు. అలీపై ఉపయోగించిన పదాలపై బిధూరిని నడ్డా వివరణ కోరినట్లు తెలిసింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా ఈ నెల 21న చంద్రయాన్-3పై చర్చ జరుగుతున్న సమయంలో అలీపై బిధూరి అవమానకరమైన వ్యాఖ్యలు, మతదూషణలకు పాల్పడిన సంగతి తెలిసిందే. బిధూరిని పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టుతున్నాయి.. బిధూరి వ్యాఖ్యలను లెఫ్ట్ పార్టీలు ఖండించాయి. స్పీకర్ ఓం బిర్లాకు అలీ స్వయంగా లేఖ రాసారు. అయినా స్పీకర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. బిజెపి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ నేపథ్యం లోనే నడ్డాను బిధూరి కలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏమి జరిగిందనేదానికి సంబంధించి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. బిధూరికి మద్దతుగా నిషికాంత్ దూబే, సుధాన్షు త్రివేది వంటి బిజెపి ఎంపీలు రంగంలోకి దిగారు. అలీనే ముందుగా బిధూరిని రెచ్చగొట్టాడని ఆరోపిస్తున్నారు.

మళ్లీ గవర్నర్ లొల్లి

నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీలపై తెలంగాణ క్యాబినెట్ సిఫార్సు తిరస్కరణ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఇద్దరు నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీల ప్రతిపాదనను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. ఆర్టికల్ 171 (5) ప్రకారం వారికి అర్హతలు సరిపోవని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి గవర్నర్ వారం క్రితం పంపిన సమాచారం సోమవారం వెలుగులోకి వచ్చింది. దీంతో, నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీల నియామకం మరోసారి వివాదాస్పదమైంది. గతంలో కౌశిక్ రెడ్డి నియామక ప్రతిపాదనను కూడా గవర్నర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. బిఆర్ఎస్ నేతలు కుర్రా సత్యనారాయణ, దాసోజు శ్రవణ్‌లను గవర్నర్ కోటా కింద శాసనమండలికి నామినేట్ చేయాలని ఈ ఏడాది జులై 31న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు రాజ్‌భవన్‌కు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. వీటిని పరిశీలించిన గవర్నర్... వీధ్దరికీ తగిన అర్హతలు లేవంటూ, వారిని నామినేట్ చేయడం తగదంటూ సిఎంకు, సిఎస్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. 'అర్హతలు ఉన్న ఎంతోమంది ప్రముఖులు రాష్ట్రంలో ఉన్నారు. వారిని పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయాలతో సంబంధం ఉన్న వారి పేర్లు సిఫార్సు చేయడం సరైంది కాదు. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం ఉన్న వారికి గుర్తింపు లభించదు. సరైన వ్యక్తులకు అవకాశాలు నిరాకరించినట్లవుతుంది. ఎమ్మెల్సీలుగా ఎవరిని నామినేట్ చేయకూడదో ప్రజాప్రాతినిధ్య చట్టంలో స్పష్టంగా ఉంది. మంత్రివర్గ సిఫార్సులో అన్ని అంశాలనూ జత చేయలేదు' అని గవర్నర్ ఆ లేఖలో పేర్కొన్నారు. గవర్నర్ నిర్ణయంపై మంత్రులు, బిఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. రాజ్‌భవన్‌ను రాజకీయ అడ్డాగా మార్చి గవర్నర్ రాజకీయాలు చేస్తున్నారని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఒక రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలిగా ఉన్న మీరు తెలంగాణకు గవర్నర్‌గా నియమించబడలేదా? అని తమిళిసైని ఉద్దేశించి అన్నారు. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అటవీ, పర్యావరణ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి విమర్శించారు.

కదంతొక్కిన సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు

అమరావతి బ్యూరో : విజయవాడలో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు కదంతొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా చౌక్‌లో సోమవారం భారీ ఎత్తున ఆందోళన చేశారు.

సచివాలయ వ్యవస్థ సరికాదు

- ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేదు
- కాగ్ విమర్శ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థపై కాగ్ (కంప్ట్రోలర్ అడిటర్ జనరల్) తీవ్రంగా విమర్శలు చేసింది. ఇది ఒక స్వతంత్ర వ్యవస్థగా ఉందని పేర్కొంది. గ్రామ, వార్డు స్థాయిల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండానే ఏర్పాటుచేసిన ఈ వ్యవస్థ రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చిందని పేర్కొంది. దీనివల్ల స్థానిక స్వపరిపాలన కోసం ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తి నీరిగారిందని ఆక్షేపించింది. అందుకే స్వపరిపాలన సాధించేందుకుగాను వార్డు కమిటీలను ఏర్పాటుచేయాలని, వార్డు కమిటీలు, ఏరియా సభలతో సచివాలయాలను అనుసంధానం చేయాలని కాగ్ సిఫార్సు చేసింది. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసేందుకుగాను జిల్లా ప్రణాళిక కమిటీలను, నగరాల్లో మహానగర ప్రణాళిక కమిటీలు ఏర్పాటుకాలేదని కాగ్ పేర్కొంది. స్థానిక సంస్థల అవసరాలు, ఉమ్మడి ప్రయోజనాల అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపించింది. అందుకే డిసిసి, ఎంసిసిలు తక్షణమే ఏర్పాటుచేయాలని సూచించింది.

ఆస్తి పన్ను వసూళ్లపైనా

ఆస్తి పన్ను వసూలు చేసే అధికారం స్థానిక సంస్థలకే ఉన్నప్పటికీ, ఆ విధానం ఇప్పటికీ ప్రభుత్వం వద్దనే ఉన్నాయని కాగ్ గుర్తు చేసింది. సొంత ఆదాయాన్ని సమకూర్చుకునే పూర్తి స్వయం ప్రతిపత్తి స్థానిక సంస్థలకు లేకుండా పోయిందని కాగ్ ఆక్షేపించింది. ఆస్తి పన్నును మదింపు చేసేందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు ఆస్తి పన్ను బోర్డును ఏర్పాటుచేయాలని 13వ ఆర్థిక సంఘంలోనే చెప్పినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని కాగ్ పేర్కొంది. పట్టణాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఇతర అంశాల్లో ప్రణాళికల కోసం సరైన విధానాలు లేవని, అందుకే ఈ అంశాలను స్థానిక సంస్థలకు అప్పగించాల్సి ఉందని కాగ్ సిఫార్సు చేసింది.

కనిపించని నీటి పనులు

2017-18లో అనేక గ్రాంటుల కింద 110 పనులకు 7,835 కోట్లతో చర్యలు ప్రారంభించాయని, అయితే కేవలం 148 కోట్లతో ఎనిమిది పనులు మాత్రమే పూర్తయ్యాయని కాగ్ గుర్తించింది. ఇంకా 6,424 కోట్లతో 102 పనులు పూర్తికావాల్సి ఉందని కాగ్ వివరించింది. దీనివల్ల 2021 మార్చి నాటికి 11.61 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదని కాగ్ పేర్కొంది.

గజపతినగరంలో మాట్లాడుతున్న రమాదేవి

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

- కొనసాగిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర

ప్రజాశక్తి- యంత్రాంగం

వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ, రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను అడ్డుకుని, పరిరక్షణను కాపాడుకుందామని సిపిఎం నాయకులు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర ఆరోరోజు సోమవారం బొబ్బిలి నుంచి ప్రారంభమై రామభద్రపురం, గజపతినగరం, శృంగవరపుకోట మీదుగా అరకు చేరుకుంది. ఆయా సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, కె.లోకనాథం, రాష్ట్ర నాయకులు జగ్గునాయుడు మాట్లాడారు. ఉత్తరాంధ్రలో కొనసాగుతున్న యాత్ర విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి ప్రవేశించింది. అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయతీ, వెంకయ్యపాలెం, కాశీపట్నం, శివలింగపురం, డముకు, బొర్రా జంక్షన్ మీదుగా అనంతగిరి మండల కేంద్రానికి చేరింది. ఆయా సభల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, డి.రమాదేవి, అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడారు. త్యాగాలతో ఏర్పడ్డ ఉక్కును ఐక్యపోరాటాలతో కాపాడుకుంటామన్నారు. సుంకరమెట్ట వద్ద ఈ యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

బైజూస్ అవినీతిని బయటకు తీస్తాం

- ఈ ప్రభుత్వం అన్నింటా అవినీతే
- ప్రతిపక్షాలను అణచివేయడం సరికాదు : బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసు తరహాలోనే వైసిపి ప్రభుత్వ హయాంలోని బైజూస్ అవినీతి కూడా బయటకు వస్తుందని బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పేర్కొన్నారు. బైజూస్ అవినీతిపై తమ పార్టీ ఆధారాలు సేకరిస్తోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అన్నింటిలోనూ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. అనంతపురంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరును తప్పుబట్టారు. అధికారులకు రాజకీయాలతో పని ఏమిటని ప్రశ్నించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకెళ్లి అధికారులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరమేమిటని నిలదీశారు. చంద్రయాన్-3 విజయం సాధించినంత గొప్పగా స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో అధికారులు ప్రచారం చేస్తున్నారంటూ తప్పుబట్టారు. ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలను, మీడియా సంస్థలను అణచివేసే ప్రయత్నాలను ఈ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఇసుక, మద్యం ఇలా అన్నింటిలోనూ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. అవినీతి ఆరోపణలు ఉన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చార్లస్ శోభరాజ్ తరహాలో బెయిల్‌పై తప్పించుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఒత్తిడిని తట్టుకోలేక ప్రతి రోజూ పోలీసులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు ఈ ప్రభుత్వానికి ఏ మాత్రమూ పట్టడం లేదని విమర్శించారు. ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. ఉత్తుత్తి బటన్లు నొక్కుతూ జనాన్ని జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. పొత్తులపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ దీనిపై ఇప్పుడేమీ చెప్పలేమని, జనవరి నాటికి స్పష్టత వచ్చే అవకాశముందని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన సోమవారం ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో సందర్శకులు పాల్గొని తిరుమాడ వీధులలో స్వామివారి రథాన్ని లాగారు. ఈ ఉత్సవంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన నిర్బంధం

- రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల అరెస్టులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రభుత్వ నిర్బంధాన్ని అధిగమించి అంగన్‌వాడీలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కదంతొక్కారు. ర్యాలీలు, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలను, వారికి మద్దతుగా నిలిచిన సిపిఎం, సిఐటియు, ఎఐటియుసి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నాలో సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ తెలంగాణ కంటే మన రాష్ట్రంలో అంగన్‌వాడీలకు ఎక్కువ జీతం ఇస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయమని కోరిన వారిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని తెలిపారు. విజయవాడ ధర్నా చౌక్‌కు వెళ్తున్న ప్రకాశం, అనంతపురం, పల్నాడు జిల్లాలకు చెందిన పలువురు అంగన్‌వాడీలను, ఆయాలను పోలీసులు అరెస్టు చేసి గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ తరలించారు. వారిని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు బెదిరించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులను, సిఐటియు నాయకులను బలవంతంగా అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టై స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీలను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కలిసి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. నంద్యాలలో అరెస్టు చేసిన నాయకులను రాత్రంతా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఉంచారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులును పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి పోలీసు వాహనం ఎక్కించారు. దీంతో, ఈ వాహనాన్ని అంగన్‌వాడీలు అడ్డుకొన్నారు. విజయవాడ వెళ్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలను కలపర్రు టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఏలూరులో అరెస్టు చేసి పెదవేగి పోలీసు ట్రైనింగ్ సెంటర్ వద్దకు తరలిస్తుండగా సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ నేతృత్వంలో బస్సులను అడ్డుకుని అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో, పోలీసులు వారిని విడుదల చేశారు. రాజమహేంద్రవరం, కాకి నాడలో నిరసనలకు దిగిన అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. అనకాపల్లిలో అంగన్‌వాడీలు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఐసిడిఎస్ పిడి కార్యాలయాన్ని ముట్టడించారు. అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని ఖండిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, అరకు, చింతూరు, రంపచోడవరం, దేవీపట్నం తదితర చోట్ల నిరసనలు తెలిపారు. విశాఖ, కర్నూలు, ఏలూరు, బాపట్ల, కృష్ణా, వైఎస్‌ఆర్ జిల్లాల్లో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు.

అనకాపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మెరుగైన అవకాశాలు సృష్టించేందుకే చట్టసవరణ

- 'అసైన్డ్' చర్చలో మంత్రి ధర్మాన

ప్రజాశకి-అమరావతి బ్యూరో

అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పించడమంటే.. అమ్ముకోడానికే హక్కు కల్పించినట్లు కాదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. లబ్ధిదారులు మెరుగైన జీవన పరిస్థితులలోకి వెళ్లేందుకు భూములను ఉపయోగించుకోవాలనే లక్ష్యంతో అసైన్డ్ చట్టసవరణను చేపట్టామని తెలిపారు. శాసనసభలో సోమవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో అసైన్డ్ చట్టసవరణపై మంత్రి ధర్మాన మాట్లాడారు. పేదల చేతుల్లోనుంచి బలవంతంగా అసైన్డ్ భూములు లాక్కోకూడదనే అప్పట్లో అసైన్డ్‌చట్టాన్ని పకడ్బందీగా రూపొందించారని తెలిపారు. గ్రామాల్లో దౌర్జన్యంగా భూములు లాక్కునే పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. రైతుల వద్ద వున్న ఈ భూములను కొనరాదు, అమ్మరాదు, మార్పిడి చేయరాదు అనే నిబంధనలతో ఆ భూమికి విలువలేకుండా పోయిందని తెలిపారు. అందుకే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అధ్యయనం చేశాక 20 ఏళ్ల తర్వాత అసైన్డ్‌దారులకు సర్వహక్కులు కల్పించేలా అసైన్డ్ చట్టసవరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ చట్టసవరణతో రాష్ట్రంలో 28లక్షల ఎకరాలకు సర్వహక్కులను రైతులు పొందనున్నారని తెలిపారు. తాత, తండ్రి పేరిట వున్న ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాలు కూడా విలువలేకుండా వున్నాయని వాటికి మార్కెట్‌లో విలువ పెరిగేలా పదేళ్లకు రెగ్యులర్ చేస్తున్నామని తెలిపారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు జై కొట్టిన శాసనసభ

- చంద్రబాబు భవిష్యత్తుకే గ్యారెంటీ లేదన్న మంత్రి రోజా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు శాసనసభ జై కొట్టింది. మహిళా సాధికారత, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సభలో సోమవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును సమర్థించిన మొదటి రాష్ట్రంగా ఏపి నిలిచింది. అనంతరం మహిళ సాధికారతపై జరిగిన చర్చలో మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం గత ప్రభుత్వం కంటే వైసిపి ప్రభుత్వం పది రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టిందని, ఎన్నో సంక్షేమ పథకాలతో పేదలను ప్రభుత్వం ఆదుకుందని అన్నారు. మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడుతూ "భవిష్యత్తుకు గ్యారెంటీ - బాబు ష్యూరిటీ" అని చెప్పిన చంద్రబాబు భవిష్యత్తుకే గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. జగన్‌ను ఇంటికి పంపిస్తానని చెప్పిన చంద్రబాబు నేడు రాజమండ్రి జైలులో ఉన్నారని, జగన్‌కు భయాన్ని పరిచయం చేస్తానన్న లోకేశ్ భయపడి ఢిల్లీకి పారిపోయారని అన్నారు. మహిళల కోసం జగన్ చేసిన కృషికి జగనన్నా.. అంటూ ఒకటికి రెండు సార్లు పిలిచి సిఎంకు రోజా సెల్యూట్ చేశారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ మహిళా సంక్షేమంలో దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. మహిళా రైతులకు సిఎం జగన్ అండగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే కె.శ్రీదేవి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం పొదుపు సంఘాలను మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రాజకీయంగా అనేక అవకాశాలు కల్పించారని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. మాజీమంత్రి పుష్పశ్రీ వాణి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదింటి ఆడబిడ్డకు సిఎం జగన్ అండగా ఉన్నారని, రాష్ట్రంలో మహిళలకు రాజకీయంగా అవకాశం కల్పిస్తున్నారని అన్నారు.

రాష్ట్రం లూటీ

- నాలుగేళ్లల్లో లక్షల కోట్లు సంపాదించిన సిఎం
- టిడిపి మాక్ అసెంబ్లీలో విమర్శలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల్ని పీడిస్తూ రాష్ట్రాన్ని లూటీచేశారని టిడిపి విమర్శించింది. నాలుగేళ్లల్లో లక్షల కోట్లు సంపాదించిన వ్యక్తి అవినీతిపై సుభాషితాలు చెప్పడం హాస్యాస్పదమని పేర్కొంది. టిడిపి కార్యాలయంలో మాక్ అసెంబ్లీ జరిగింది. 'ఆర్థిక ఉగ్రవాది @ ధన పిశాచి' అనే అంశంపై వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో వైసిపి బహిష్కృత ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ 2000లో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జగన్, అతని కుటుంబం ఇప్పుడు అపర కుబేరులుగా ఎదిగారని వివరించారు. అవినీతిలోనూ, నేరచరిత్రలోనూ జగన్‌దే అగ్రస్థానమని, తనపై 38 కేసులున్నాయని జగన్ 2019 ఎన్నికల అఫిడవిట్‌లో చెప్పారని పేర్కొన్నారు. ఓబుళాపురం గనుల తవ్వకాల్లో గాలి జనార్థన్‌రెడ్డి పాత్రధారి అయితే తెరవెనుక సూత్రధారి జగన్ అని విమర్శించారు. తండ్రి అధికారంతో వేలకోట్లు కొట్టేశారని, తన అధికారంలో ప్రజల, ప్రభుత్వ ఆస్తుల్ని అప్పనంగా మింగేశారని విమర్శించారు. నాలుగేళ్లల్లో రూ.2,27,500కోట్లు జగన్ దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు అవినీతిపరుడని జగన్ చేస్తున్న ప్రచారం మొత్తం ఈర్ష్యాద్వేషాలతో చేస్తున్నదేనన్నారు. తన అవినీతి, దోపిడీని ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్న చంద్రబాబు కూడా జైల్లో ఉండాలన్న కుట్ర, దుర్మార్గంతోనే అన్యాయంగా కటకటాల పాలు చేశారని ఆరోపించారు. జగన్ చేసిన తప్పు తెలుసుకొని చంద్రబాబును తక్షణమే విడుదల చేసి, బహిరంగ క్షమాపణలు చెప్పాలని టిడిఎల్‌పి తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, పత్తిపాటి పుల్లారావు, టిడి జనార్థన్, గద్దె రామ్మోహనరావు, గొట్టిపాటి రవి, బాల వీరాంజనేయ స్వామి, చిరంజీవిరావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల కొరత

- పలు ప్రభుత్వ పాఠశాలలకు ఆటస్థలాలే లేవట

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పిఇటిల కొరత ఉన్న మాట వాస్తవమేనని శాసనసభలో ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 30శాతం పిఇటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తన నియోజకవర్గంలోని 79 పాఠశాలలకు ఆటస్థలాలు లేవని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానమిచ్చారు. 6,913 స్కూల్ అసిస్టెంట్ (వ్యాయామ విద్య) పిఇటి పోస్టులు మంజూరు చేయగా, 4,742 మంది మాత్రమే పనిచేస్తున్నారని, 1960 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు కొట్టుకుపోయింది నిజమే : మంత్రి అంబటి

ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ ప్రాజెక్ట్ క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన మాట నిజమేనా అని టిడిపి ఎమ్మెల్యేలు డోలా బాలవీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు, అచ్చెన్నాయుడు కింజరాపు, గొట్టిపాటి రవికుమార్ లిఖితపూర్వకంగా అడిగిన ప్రశ్నకు మంత్రి అంబటి రాంబాబు సమాధానమిచ్చారు. గేట్లు కుంగిపోవడంతో 31.08.22న మూడవ గేటు దిగువ 1/3వ భాగం కొట్టుకుపోయిందన్నారు. స్టాప్ లాగ్ గేట్ల సాయంతో 2022-23 రబీలో నీరందించేందుకు వీలుగా వెంట్‌ను మూసివేసి నీటిని నిల్వ చేసినట్లు సభకు తెలిపారు. జలాశయం యొక్క స్పిల్ వే గేట్ల మరమ్మతులకు, పునః స్థాపనకు రూ.917 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు అందిన వెంటనే చర్యలు

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని 9, 10వ షెడ్యూల్ కింద ఆస్తుల వివరాలు? విభజనను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని టిడిపి సభ్యులు అనగాని సత్యప్రసాద్, డాక్టర్ నిమ్మల రామానాయుడు, అశోక్ బెందాళం, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఏలూరి సాంబశివరావు, అచ్చెన్నాయుడు లిఖిత పూర్వకంగా అడిగిన ప్రశ్నకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014లోని నిబంధనల ప్రకారం షెడ్యూల్ 9, 10 సంస్థల ఆస్తులు, అప్పుల విభజన అంశాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినా ఫలితం ఇవ్వకపోవడంతో సుప్రీంకోర్టులో డబ్ల్యుపి (సి) నెంబరు 001091/2022ను దాఖలు చేశామని సభకు తెలిపారు.

కేంద్ర ఉత్తర్వులు రాగానే తూర్పుకాపులకు ఒబిసి ధ్రువపత్రాలు

తూర్పుకాపు సామాజిక వర్గానికి ఒబిసి ధ్రువ పత్రాల జారీకి సంబంధించి ఈ నెల 13న న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ బిసిల జాతీయ కమిషన్ (ఎన్‌సిబిసి) బహిరంగ విచారణను నిర్వహించిందని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతుందని తెలిపారు. జగనన్న గోరుముద్దపై జరిగిన చర్చలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 2019-20, 2022-23 వరకు రూ.6,262.29 కోట్లను ఖర్చు చేశామని, 1,54,50,580 మంది విద్యార్థులు లబ్ధిపొందారని తెలిపారు.

'దిశ'కు కేంద్రం అడ్డు

- శాసనమండలిలో హోంమంత్రి వనిత ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాలికలు, యువతులపై అత్యాచార ఘటనలలో గరిష్ట శిక్షా పరిమితిని నిర్దేశిస్తూ రూపొందించిన పోక్సో చట్టం ఉండగా మళ్లీ దిశ చట్టం ఎందుకని కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. మూడేళ్లుగా దిశచట్టం పెండింగ్‌లో ఉండటంపై శాసనమండలిలో సోమవారం చర్చ జరిగింది. ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, పర్చూరి అశోక్‌బాబు, వేపాడ చిరంజీవిరావు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు మంత్రి తానేటి వనిత సమాధానం చెబుతూ దిశ చట్టం రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రానికి పంపామని, పోక్సో చట్టంలోని అంశాలే దిశలో ఉన్నందువల్ల ఈ చట్టం ఎందుకని కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. కేంద్రం అభ్యంతరాలపై మూడేళ్లుగా పలు వివరణలు పంపామన్నారు. తాజాగా కేంద్రం ఐపిసి చట్టాలను మారుస్తున్నందు వల్ల ఈచట్టంను పెండింగ్‌లో పెట్టిందన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దిశ చట్టం ఆమోదంలో రాష్ట్రప్రభుత్వం అధికారులు సమర్థవంతంగా వ్యవహరించలేకపోయారన్నారు. కేంద్రం ఐపిసి చట్టాలను నెల రోజుల క్రితం సవరణకు పూనుకుందని, దిశ చట్టం మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉందన్నారు. ఎమ్మెల్సీ పి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని కేంద్రానికి పంపకుండా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండేలా రూపొందించి ఉంటే బాగుండేదన్నారు.

చే'నేత'కు పథకాలు అందడం లేదు

అంతకు ముందు చేనేత కార్మికులకు ఆర్థిక సాయంపై ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అడిగిన ప్రశ్నకు మంత్రి గుడివాడ అమరనాథ్ మాట్లాడుతూ నేతన్ననేస్తం, పింఛనుకానుక, నగదుపరపతి తదితర పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ అర్హులైన చేనేత కార్మికులకు ఈపథకాలు అమలు కావడంలేదన్నారు. నేతన్న నేస్తం షెడ్డు నిర్మాణ దారుడికి ఇస్తున్నారని నేత కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలు విడుదల చేయాలని ఎమ్మెల్సీ పోతుల సునీత కోరారు. పిఎం అవాస్ యోజనపై ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, బి.తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నలకు గృహ నిర్మాణ మంత్రి జోగి రమేష్ సమాధానం ఇస్తూ గత నాలుగేళ్లలో 21.75 లక్షల ఇళు మంజూరుకాగా 6.50 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోవడం లేదని బ్యాంకుల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యేలతో సమానంగా ఎమ్మెల్సీలకు సిఫార్సు లేఖలను ఇవ్వాలని ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, తదితరులు కోరారు. ఈ అంశంపై సిఎంతో చర్చిస్తానని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు.

జస్టిస్ సోమయాజులుకు సత్కారం

ప్రజాశక్తి-అమరావతి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఆయనకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు చెప్పింది. ఫస్ట్ కోర్టు హాల్లో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అధ్యక్షతన ఫుల్ కోర్టు సమావేశమైంది. ఆరు వేల కేసుల్ని జస్టిస్ సోమయాజులు పరిష్కరించారని సిజె చెప్పారు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్‌గా, బిసిసిఐ లీగల్ కమిటీ మెంబర్‌గా, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, న్యాయవాదిగా, న్యాయమూర్తిగా సమర్థంగా పనిచేశారని కొనియాడారు. జిల్లా కోర్టులో న్యాయవాది నుంచి హైకోర్టు న్యాయమూర్తి అయిన తొలి వ్యక్తని గుర్తు చేశారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా సంతప్తికరంగా విధులు నిర్వహించినట్లు జస్టిస్ సోమయాజులు చెప్పారు. తొలుత ఏజీ ఎస్.శ్రీరామ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరామ్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ హరిన్యాద్, ఇతరులు మాట్లాడారు. అనంతరం హైకోర్టు న్యాయవాదుల సంఘం కూడా జస్టిస్ సోమయాజులును సత్కరించింది.

అమరావతిని నీరుగార్చారు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి కాలపరిమితి లేకుండా ఉన్న 55 ప్యాకేజీల ఒప్పందాలపై అనిశ్చితి పెరుగుతోందని వ్యాఖ్యానించింది. ఈ 55 ప్యాకేజీ పనులు పూర్తి చేసేందుకు 28,048 కోట్లు కావాల్సి ఉందని పేర్కొంది. వీటి భూసమీకరణకు 2,245 కోట్లు క్రిడా వ్యయం చేసిందని, ఇలా సేకరించిన భూమి అంతా నిరుపయోగంగా పడి ఉందని అభిసంశించింది. సమీకరించిన భూమిలో మౌళికాభివృద్ధి కోసం 13,803 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం 183 కోట్లు మాత్రమే అక్టోబర్ 2021 వరకు ఖర్చు చేసినట్లు గుర్తించినట్లు కాగ్ వెల్లడించింది. దీంతో 2021 సెప్టెంబర్ వరకు 16 ప్యాకేజీల్లో నాలుగు ప్యాకేజీల్లో కేవలం 10 నుంచి 18 శాతం పురోగతి సాధించినట్లు కాగ్ వెల్లడించింది. మరో 12 ప్యాకేజిలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని పేర్కొంది.

నిధుల వ్యయంచేసినా...

అనేక ప్యాకేజిల్లో 3,213 కోట్లు వ్యయం చేసినా ఆ పనులు పూర్తిగా నిలిచిపోయాయని కాగ్ ఆక్షేపించింది. మరో 270 కోట్లతో పైపులు కొనుగోలు చేసినా అవి నిరుపయోగయి పడి ఉన్నాయని, దీంతో ఆ వ్యయం నిష్ఫలమైందని కాగ్ ఆక్షేపించింది. రహదారుల నిర్మాణంలోనూ నిష్ఫల వ్యయం కనిపించిందిని కాగ్ ఆరోపించింది. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న సీడ్ యాక్సెస్ రహదారిని భవిష్యత్తు ట్రాఫిక్‌కు అనుగుణంగా తొమ్మిది లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని భావించి విస్తరణ పనులు ప్రారంభించారని, అయితే భూసేకణ సమస్య కారణంగా 44 కోట్లు వ్యయం అనాలోచితంగా చేసినట్టయిందని కాగ్ పేర్కొంది.

ప్రభుత్వ భవనాలకు సంబంధించి 19 ప్యాకేజిల్లో 6,848 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం రెండు ప్యాకేజిల్లో 527 కోట్లుతో పనులు పూర్తయ్యాయని, మిగిలిన 17 ప్యాకేజిల్లో 1,505 కోట్లు వ్యయం చేశారని, అవి పూర్తి కాలేదని కాగ్ పేర్కొంది.

అంతా సందిగ్ధమే

2019 నుంచి అన్ని ప్యాకేజిల పనులు నిలిచిపోవడంతో వాటి పురోగతిపై సందిగ్ధం నెలకొందని కాగ్ అభిప్రాయపడింది. ఫలితంగా అప్పటివరకు ఖర్చు చేసిన 1,505 కోటల నిధులు కూడా ప్రణాలికాలోపంతో నిరుపయోగమయ్యాయని కాగ్ విమర్శించింది. అలాగే అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులకు 208 కోట్లుతో కొనుగోలు చేసిన సామగ్రి కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయని వ్యాఖ్యానించింది. మరికొన్ని పనుల్లో కూడా కోట్లాది రూపాయలు వృధాగా మారిపోయాయని కాగ్ ఆక్షేపించింది.

గత ప్రభుత్వంలోనూ...

అమరావతి నిర్మాణానికి సంబంధించి గత టిడిపి ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలను కాగ్ తప్పు పట్టింది.

రాజధానికి అవసరమైన భూమిలో 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని అప్పట్లో తీసుకున్న నిర్ణయం కారణంగా రానున్న కాలంలో భారీ ఆర్థిక భారం పడనుందని కాగ్ పేర్కొంది. మాస్టర్ ప్లాన్ తయారీలో కూడా కన్సల్టెంట్లను నామినేషన్ పద్ధతిలో ఎంపిక చేయడాన్ని కూడా ప్రస్తావించింది. అందుకే స్పష్టమైన ఆర్థిక ప్రణాళికలు లేకుండా 33,476 కోట్లతో సిఆర్‌డిఎ, ఎడిసిఎల్‌లు అనేక ప్యాకేజిలకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయని పేర్కొంది. ఫలితంగా 2016 నుంచి 2023 వరకు 55,343 కోట్లు అవసరం కాగా, అన్ని ఆర్థిక వనరుల నుంచి కేవలం 11,487 కోట్లు మాత్రమే సమీకరించుకోగలిగారని వివరించింది.

సిఎం కుటుంబ భద్రత బిల్లు మండలిలో ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రితో పాటు ఆయన కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయి రక్షణ కోసం తీసుకొచ్చిన బిల్లును శాసనమండలి సోమవారం ఆమోదించింది. హోంశాఖ మంత్రి తానేటి వనిత ఈ బిల్లును ప్రవేశపెట్టారు. పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ ఆధార్ (టార్గెటెడ్ డెలిలరీ ఆఫ్ ఫైనాన్షియల్ అండ్ అదర్ సబ్సిడీస్, బెనిఫిట్స్ అండ్ సర్వీసెస్) బిల్లును కూడా మండలి ఆమోదించింది.

మండలిలో పిడిఎఫ్ పట్టు

(మొదటి పేజీ తరువాయి)

అనుమతిస్తామని ఛైర్మన్ హామీ ఇచ్చారు.

వేతనాల పెంపుపై కేంద్రాన్ని సంప్రదించాం : మంత్రి ఉషశ్రీ చరణ్

అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాట్యూటీ చెల్లింపు కోసం సుప్రీంకోర్టు తీర్పు అమలుకు తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ సమాధానం ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అర్హులైన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులందరికీ గ్రాట్యూటీ ప్రయోజనాన్ని వర్తింపజేయాలన్న అభ్యర్థనపై కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖను సంప్రదిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 60 ఏళ్ల వయసుకు చేరిన వర్కర్లకు రూ.50 వేలు, సహాయకులకు రూ.20 వేలు సేవా ముగింపు ప్రయోజనం అందిస్తున్నట్టు వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు అమలు చేసేందుకు ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేలు వేతనం, పదవీవిరమణ ప్రయోజనాల అమలుకు చర్యలు తీసుకోకుండా కేంద్రాన్ని సంప్రదిస్తున్నామని చెప్పి కాలయాపన చేయడం తగదన్నారు. మిగతా రాష్ట్రాలు ఇప్పటికే సుప్రీంకోర్టు నిర్ణయాలు అమలుచేస్తుంటే రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనం పెంచుతామని సిఎం జగన్ పాదయాత్రలో, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. కానీ వర్కర్లకు రూ.11,500, సహాయకులకు రూ.7,500 ఇస్తున్నారని తెలిపారు. అంతేగాక యాప్‌లతో అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గతంలో కన్నా ఇప్పుడు వారి పనిభారం పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించాలన్నారు. మంత్రి ఉషశ్రీ సమాధానం చెబుతూ యాప్‌ల ఇబ్బంది నుంచి తగ్గించేందుకు ఒక ఎంబి డేటా అదనంగా ఇస్తున్నట్టు తెలిపారు. 2014-2019 కన్నా ఎక్కువ వేతనాలు ఇస్తున్నామని చెప్పారు.

ఈడ్చి పడేశారు

అంగన్‌వాడీలపై పోలీసుల దాష్టీకం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

నిర్బంధాన్ని అధిగమించి వివిధ మార్గాల్లో విజయవాడ ధర్నా చౌక్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన అంగన్‌వాడీలపై పోలీసులు విరుచుకుపడ్డారు. రెండు రోజుల నుండి ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నా వేలాదిమంది విజయవాడ వీధుల్లో ప్రత్యక్షం కావడం పోలీస్ అధికారులను సైతం విస్మయపరిచింది. దీంతో ఆర్‌టిసి బస్టాండు, రైల్వే స్టేషన్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, బీసెంట్ రోడ్డు, సిఆర్‌డిఎ కార్యాలయం, అలంకార్ సెంటర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో కనిపించిన కనిపించినట్లుగా పోలీసులు అరెస్ట్ చేశారు. అనుమానం వచ్చిన సామాన్య ప్రజలను కూడా జీపులు, వ్యాన్‌లు ఎక్కించడంతో పలు ప్రాంతాల్లో వాగ్వివాదం చోటుచేసుకుంది. దుర్గ గుడికి, ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన వారిని కూడా అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించారు. పోలీసులను తప్పించుకుని వందలాది మంది ఒక్కసారిగా ఏలూరురోడ్డు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్దకు చొచ్చుకువచ్చారు. వీరిని అతి కష్టంమీద ధర్నా చౌక్‌కు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు సుబ్బరావమ్మ, ప్రధాన కార్యదర్శి బేబీరాణి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, నాయకులు శ్రీనివాస్, ఎన్‌సిహెచ్ సుప్రజ, సీనియర్ నాయకులు రోజా తదితరులు ఏలూరు రోడ్డుపై బైఠాయించారు. వీరిని కూడా పోలీసులు ఈడ్చిపడేశారు. అనంతరం ఐఎఫ్‌టియు అనుబంధ సంఘం నాయకులు కూడా రోడ్డుపైకి దూసుకొచ్చారు. వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అక్కడే రోడ్డుపై బైఠాయించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

పోలీసుల దురుసు ప్రవర్తన

రోడ్డుపై బైఠాయించిన వారిని పోలీసులు ఈడ్చుకుంటూవెళ్లి ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు, ఆటోలు, పోలీసు వాహనాల్లో వేశారు. అదుపులోకి తీసుకునే క్రమంలోనే మహిళా పోలీసులు అంగన్‌వాడీలపట్ల దురుసుగా ప్రవర్తించారు. బస్సుల డోర్లు, ఆటోలకు తలలను మోదారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తల మొఖంపై మహిళా పోలీసులు పిడిగుద్దులు గుద్దారు. ఈ దెబ్బలకు తాళలేక అంగన్‌వాడీ కార్యకర్త ఒకరు సొమ్ముసిల్లి పడిపోయారు. ఈ ఘటనలను చిత్రీకరిస్తున్న ఐఎఫ్‌టియు చిత్తూరు జిల్లా నాయకుడి నుండి సెల్‌ఫోన్ లాక్కుని ఓ ఐపిఎస్ అధికారి అటుగా వస్తున్న బస్సు చక్రాల కింద పడేసి ధ్వంసం చేశారు. అరెస్ట్ అయిన వారిని ఎఆర్ గ్రౌండ్స్, ఆటోనగర్ మొబైల్ మర్చంట్స్ అసోసియేషన్ హాలు, భవానీపురం పోలీసుస్టేషన్, సింగ్‌నగర్ వడ్డెరకాలనీ కళ్యాణమండపం, కండ్రిక కమ్యూనిటీ హాలు, నక్షత్ర కళ్యాణమండపాలకు తరలించారు. పోలీసుల తోపులాటలో అనంతపురం జిల్లా నాయకులు శకుంతల మోకాలికి దెబ్బతగడంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. పలువురు మహిళలకు గాయాలయ్యాయి. అరెస్టుల క్రమంలో సుమారు రెండుగంటలపాటు ఏలూరురోడ్డులో ఉద్రిక్తత నెలకొంది. అరెస్టయిన వారిలో ఎఐటియుసి నాయకులు ఓబులేసు, లలితమ్మ, మంజుల, ఐఎఫ్‌టియు నాయకులు భారతి, పోలారి తదితరులు ఉన్నారు.

విజయవాడ ఎఆర్ గ్రౌండ్స్‌లో పోలీసుల నిర్బంధంలో ఉన్న అంగన్‌వాడీలు

వామపక్ష పార్టీల ఖండన

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసిన వేలాదిమంది అంగన్‌వాడీలను, వారిపై నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన ట్రేడ్ యూనియన్, సిపిఎం నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అరెస్టు చేసిన సిఐటియు రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరరావు, ఎ.వి.నాగేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు జి.ఓబులేసు, ఆర్.రవీంద్రనాథ్, ఐఎఫ్‌టియు నాయకులు పి.ప్రసాద్, పోలారి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వి.వెంకటేశ్వర్లు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. వీరితోపాటు గన్నవరం, రాజమండ్రి, చిత్తూరు, అనంతపురం, తదితర జిల్లాల్లో అరెస్టు చేసిన నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని వామపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. . తమ న్యాయమైన కోర్కెల సాధనకు విజయవాడలో అంగన్వాడీలు ధర్నా చేయాలని నిర్ణయించారని, ముఖ్యమంత్రి స్వయంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ధర్నాకు వచ్చిన మహిళలను ఎక్కడికక్కడ బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లలో జల్లెడపట్టి అరెస్టు చేయడం గర్హనీయమన్నారు.

అరెస్టయిన నేతలకు పలువురు పరామర్శ

పోలీసులు అరెస్టు చేసిన అంగన్‌వాడీ, ట్రేడ్ యూనియన్, సిపిఎం కార్యకర్తలు, నాయకులను పలువురు పరామర్శించారు. ఇబ్రహీంపట్నం స్టేషన్లో ఉన్న వారిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాద్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, తెలుగుదేశం నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి, ప్రొఫెషనల్ ఫోరం నాయకులు నేతి మహేశ్వరరావు తదితరులు పరామర్శించారు. అరెస్టులను టిడిపి అనుబంధ అంగన్‌వాడీ సంఘ నాయకులు ఆచంట సునీత ఖండించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు సుందరయ్య, అయ్యప్పరెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.ఉమామహేశ్వరరావు, నాగభూషణం తదితరులు కూడా అరెస్టులను ఖండించారు.

సిపిఎం రాస్తారోకో

అంగన్‌వాడీలపై మోపిన నిర్బంధానికి నిరసనగా సిపిఎం రాస్తారోకోకు దిగింది. ఎక్కడికక్కడ జరుగుతున్న అరెస్ట్‌లు, ధర్నా చౌక్ వద్దకు వెళ్లనీయకపోవడం, సమస్యలను చెప్పుకునే కనీస అవకాశం కూడా ఇవ్వకుండా పోవడం తదితర అంశాల పట్ల సిపిఎం నేతలు తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర కార్యాలయంలో ఉన్న నాయకులు అప్పటికప్పుడు నిరసన తెలపాలని నిర్ణయంచారు. అంగన్‌వాడీల ఆందోళనకు మద్దతు ఇస్తూ రాస్తారోకో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇద్దరు అదనపు డిసిపిలు, ముగ్గురు ఎసిపిలు, నలుగురు సిఐలు వందలాదిమంది పోలీసులు, రోప్‌పార్టీ సిబ్బంది నాయకులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ పెద్దఎత్తున ఉద్రిక్తత నెలకొంది. నాయకులు వారిని నెట్టుకుని ముందుకు వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. స్వల్పతోపులాట జరిగింది. పోలీసుల తీరును నిరశిస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, బాబూరావు అక్కడే రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. అడ్డుకోబోయిన కార్యకర్తలను నెట్టేశారు. వి.శ్రీనివాసరావుతోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.బాబూరావు, వి.వెంకటేశ్వర్లు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వై.రాము, సిపిఎం నగర నాయకులు రమణ, శ్రీనివాసు, కమల తదితరులను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం స్టేషన్‌కు తరలించారు.

బాధ్యతగల రాజకీయ పార్టీగా మద్దతు : వి. శ్రీనివాసరావు

అంతకుముందు సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. బాధ్యతగల రాజకీయ పార్టీగా అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మద్దతు ఇస్తున్నట్లు, రాష్ట్ర ప్రభుత్వం వారిపై ప్రయోగించిన నిర్బంధాన్ని నిరసిస్తున్నట్లు చెప్పారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారని తెలిపారు. తెలంగాణా ప్రభుత్వం కన్నా అదనంగా రూ. వెయ్యి వేతనం ఇస్తామని జగన్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ హామీలను అమలు చేయాలని కోరుతూ విజయవాడ వచ్చిన వేలమందిని, మహిళలని కూడా చూడకుండా ఎక్కడికక్కడ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద అమానుషంగా అరెస్టులు చేశారన్నారు. మహిళలు కనిపిస్తే చాలు అంగన్‌వాడీలా కాదా అన్న దానితో నిమిత్తం లేకుండా పోలీసులు అడ్డుకున్నారన్నారు. విజయవాడ వచ్చిన అంగన్‌వాడీల ఉద్యోగాలను పీకేస్తామని మరోపక్క బెదిరిస్తున్నారన్నారు. 'అంగన్‌వాడీల ఉద్యోగాలు పీకేస్తే వారు మీ అధికారాన్ని త్వరలోనే పీకేస్తారు... పాలకులు ఇది గుర్తించాలి' అని ఆయన హెచ్చరించారు. అంగన్‌వాడీలను వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం తీవ్రమైన నేరం అన్నారు. దీన్ని సిపిఎం అంగీకరించదన్నారు. ఈ అమానుష ఘటనకు నిరసన తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని కళ్యాణ మండపాలను జైళ్లగా మార్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పోలీసులను ఉపయోగించి ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహిస్తున్న నిరసనలను అణచివేయడం సరికాదన్నారు.

విద్యారంగం పరిరక్షణలో యుటిఎఫ్ కీలక పాత్ర

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, నెల్లూరు

విద్యారంగ పరిరక్షణలో యుటిఎఫ్ కీలకపాత్ర పోషించిందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, యుటిఎఫ్ నాయకులు అన్నారు. హిందూపురంలో ప్రారంభమైన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల ప్రచార జాత సోమవారం నెల్లూరులో, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలో సాగింది. కడియం, సామర్లకోట, పెద్దాపురంలో యాత్ర సాగింది. నెల్లూరులో యుటిఎఫ్ జెండాను మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ అభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న కృషిని వివరించారు. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో 200 బైకులతో ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు.

ADITYA BIRLA CAPITAL
ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండ్, వేరవల్, గుజరాత్-362266.
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, కానూరు బాపయ్య కన్‌స్ట్రక్షన్స్ & లీజింగ్ బిల్డింగ్ (కెబిసిఎల్), ...
స్వాధీనత ప్రకటన

చంద్రబాబుతో భువనేశ్వరి ములాఖత్

- 40 నిమిషాల పాటు సాగిన చర్చలు
- భువనేశ్వరి వెంట బ్రాహ్మణి, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, జగ్గంపేట

'స్కిల్' స్కామ్ కేసులో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని సోమవారం ములాఖత్‌లో భాగంగా నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు కలిశారు. సుమారు 40 నిమిషాల పాటు ములాఖత్ అయ్యారు. తాజాగా జనసేన నేతలతో జరిగిన చర్చలు, లోకేష్ ఢిల్లీలో చేపట్టిన లాయర్ల కన్సల్టేషన్ గురించి వారు చంద్రబాబుకు వివరించినట్టు సమాచారం. అనంతరం జైలు వెలుపల మీడియా పాయింట్ వద్ద అచ్చెన్నాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు చెప్పడం లేదని, రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రతోనే చంద్రబాబును అరెస్టు చేశారని విమర్శించారు.

ప్రజల సొమ్ము మాకొద్దు : భువనేశ్వరి

'ప్రజల సొమ్ము మాకొద్దు... ప్రజాసేవే మా కుటుంబానికి ముద్దు' అని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కాకినాడ జిల్లా జగ్గంపేటలో నిర్వహిస్తోన్న రిలే దీక్షా శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించి మాట్లాడారు. ప్రజల సొమ్ము తినే దౌర్భాగ్య పరిస్థితిలో తాము లేమన్నారు. తాను సొంతంగా ఒక సంస్థను నడుపుతున్నామని, దానిలో రెండు శాతం షేర్లు అమ్ముకున్నా రూ.400 కోట్లు వస్తాయని తెలిపారు. ఎన్‌టిఆర్ చూపిన బాటలోనే చంద్రబాబు నడుస్తున్నారన్నారు. ఆమె వెంట టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ తదితరులు ఉన్నారు.

జిపిఎస్ రద్దు కోరుతూ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

- ఒపిఎస్‌ను పునరుద్ధరించాలంటూ నినాదాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిపిఎస్‌ను మంత్రి మండలి తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. పోలీసుల ఆంక్షలను, బారికెడ్లను తోసుకుంటూ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. తమ సమస్యలను వివరిస్తూ కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. కడపలో పలువురి నాయకులను అరెస్టు చేసి, అనంతరం విడుదల చేశారు. కర్నూలులో కలెక్టరేట్ గేట్లు ఎక్కి నిరసన తెలిపారు. ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మన్ కె.ప్రకాష్‌రావు, ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సురేష్ కుమార్, జి.హృదయ రాజు, ఎపిసిపిఎస్ఇఎ గౌరవ అధ్యక్షులు లింగారెడ్డి, తదితరులు మాట్లాడారు. సిపిఎస్, ఒపిఎస్ ముగిసిన అధ్యాయాలు అని, కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ లేకుండా ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో జిపిఎస్ తీసుకురావడం దారుణమన్నారు. కడప కలెక్టరేట్ ప్రాంతంలో బారికేడ్లను తోసుకుని ఫ్యాప్టో నాయకులు ముందుకు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ విజయకుమార్, ట్రెజరర్ వై.వెంకటసుబ్బయ్య, ఎపిటిఎఫ్ (257) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, ఎస్‌టియు జిల్లా నాయకులు పుల్లయ్యను అరెస్టు చేసి, విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు.

కడప కలెక్టరేట్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులను అడ్డుకుంటున్న పోలీసులు

కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఉపాధ్యాయులను పోలీసులు నిర్బంధించారు. మరికొందరిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన 60 మంది ఉపాధ్యాయులను వ్యక్తిగత పూచీకత్తుపై ఆ తర్వాత విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రరవరం కలెక్టరేట్, కాకినాడలో ధర్నాచౌక్ వద్ద, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, చిత్తూరు, విశాఖ, అనకాపల్లి, బాపట్ల, ఒంగోలు, ఏలూరు, అనంతపురం కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టారు. జిపిఎస్, సిపిఎస్‌లను రద్దు చేయాలంటూ విజయనగరం, పార్వతీపురం మన్యం కలెక్టరేట్ల వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. పార్వతీపురంలో డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిరావు పూలే పార్కు నుంచి ర్యాలీ చేశారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ముందుకు తోసుకుంటూ కలెక్టరేట్ గేట్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళనలో ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు ఎస్.చిరంజీవి పాల్గొన్నారు. గుంటూరులో ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఫ్యాప్టో సభ్యులు తిమ్మన్న పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ధర్నా చౌక్ వద్ద నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

Chola Enter a better life
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
డిమాండ్ నోటీసు

Chola Enter a better life
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
డిమాండ్ నోటీసు

ADITYA BIRLA CAPITAL
PROTECTING INVESTING FINANCING ADVISING
ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: ఇండియన్ రెయాన్ కాంపౌండ్, వెరవల్, గుజరాత్-362266బ్రాంచ్ అడ్రస్: డోర్ నెం. 40-1-52ఎ, కెబిసిఎల్ భవనం హెడిఎఫ్‌సి బ్యాంక్ ఎదురు, బెంజ్ సర్కిల్ వద్ద, ఎమ్‌జి రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.
అనుబంధం IV
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, యొక్క రూల్ 8(1)చూడండి)
స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

మోడీ, జగన్‌ను గద్దె దించాలి

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ను గద్దె దించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన మేధావుల చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిరంకుశ విధానాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. వారిని అధికారంలో కొనసాగిస్తే దేశానికి, రాష్ట్రానికి భవిష్యత్ ఉండదని తెలిపారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతుల విషయంలో కేంద్రం తీసుకొచ్చిన నల్లచట్టాలను రద్దు చేసే వరకూ అలుపెరుగకుండా పోరాడామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటాలు నిర్వహించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మోడీ, జగన్‌లకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని అన్నారు.

కేంద్రంలో బిజెపిని ఎవరు వ్యతిరేకిస్తారో స్పష్టత లేదు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంలో బిజెపిని మోస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, చట్టాలను పార్లమెంటు లోపలా బయట టిడిపి, వైసిపిలు పూర్తిగా సమర్థిస్తున్నాయని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే... రాష్ట్రంలోనూ ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం పోరాడుతోందని తెలిపారు. అందులో భాగంగానే విద్యుత్ ఛార్జీలు, ఆస్తిపన్ను వంటి అన్ని విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆందోళన చేస్తోందని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అంగన్‌వాడీలు న్యాయబద్ధమైన డిమాండ్లపై ఆందోళన చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం నిర్బంధానికి పూనుకోవడం తీవ్రమైన విషయమని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు నిలబడతారనే విషయంలో రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు అవకాశవాదంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్రానికి మద్దతు ఇవ్వడం రాష్ట్ర హక్కులకు, ప్రజాస్వామ్యానికి, రాష్ట్రాభివృద్ధికి తీవ్ర నష్టమని తెలిపారు. బిజెపికి వ్యతిరేకంగా రాష్ట్రంలో పార్టీలు అనుసరిస్తున్న అస్పష్ట విధానాల నేపథ్యంలో ఈ సమావేశంలో ప్రతిపాదించిన కార్యాచరణపై తమ పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చించి చెబుతామని వై.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్ అరెస్టయినప్పుడు వైసిపి, చంద్రబాబు అరెస్టయినప్పుడు టిడిపి వాళ్లు ప్రజాస్వామ్య హక్కులు లేవంటున్నారని విమర్శించారు. సమస్యలపై కార్మికులు ఆందోళనలు చేస్తుంటే వారిని అరెస్టు చేసిన సమయంలో ఎవరూ మాట్లాడటం లేదని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులనేవి నాయకులకేగాదు అందరికీ ఉంటాయని గుర్తించాలని పేర్కొన్నారు. రైతు నాయకులు, మాజీ అధికారులు, ఇంజనీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపాదకీయం

అంగన్‌వాడీలపై అణచివేత

అంగన్‌వాడీ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకై సోమవారం విజయవాడలో చేయ తలపెట్టిన మహాధర్నా ప్రభుత్వ తీవ్ర నిర్బంధాలు, అరెస్టులతో ముగిసింది. అసెంబ్లీ సమావేశాల వేళ తమ గోడును వెళ్లబోసుకొనేందుకు అంగన్‌వాడీలు ధర్నాకు పిలుపునివ్వడంతోనే ప్రభుత్వంలో గంగవెర్రులు మొదలయ్యాయి. పట్టణం, మండలం, గ్రామం అనే తేడా లేకుండా పోలీస్ నిఘా తీవ్రతరమైంది. ఎక్కడ పడితే అక్కడ అంగన్‌వాడీలను విజయవాడ వెళ్లనీకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లలో పెట్టారు. మహిళలని సైతం చూడకుండా నేతల ఇళ్లపై పడి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. రోడ్లపై పోలీస్ క్యాంపులు పెట్టి బస్సులను, కార్లను, ఆటోలను తనిఖీలు చేసి, మహిళలుంటే చాలు కిందికి దించేసి సోదాలు చేశారు. ధర్నాకు వెళితే ఉద్యోగాలు ఊడతాయని బెదిరించారు. మహిళా పోలీసులు కాకుండా పురుష పోలీసులు జులుం ప్రదర్శించారు. విజయవాడలో, జిల్లాల్లో పోలీస్ తోపులాటల్లో అంగన్‌వాడీలు సొమ్మసిల్లారు. చేతులు కాళ్లూ విరిగి ఆస్పత్రుల్లో చేరారు. ఇంతటి అణచివేతలకు ఎదురొడ్డి వేలాది మంది బెజవాడ చేరుకొని మహాధర్నాను జయప్రదం చేయడంతోనైనా అంగన్‌వాడీల పోరాట తెగువ ప్రభుత్వానికి అర్థమై ఉండాలి.

అంగన్‌వాడీల ఆందోళనను నిలువరించే క్రమంలో క్రూర నిర్బంధానికి ఒడిగట్టిన ప్రభుత్వం ఎన్నికలకు ముందు వారికి ఇచ్చిన హామీలపై స్పందించకుండా కఠిన మొరాయింపును కొనసాగించడం దారుణం. మహాధర్నా నేపథ్యంలోనూ అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటన చేసేందుకు ముందుకు రాలేదు. శాసన మండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇచ్చిన వాయిదా తీర్మానం నోటీస్ తిరస్కరణకు గురైంది. ప్రశ్నోత్తరాల్లో అంగన్‌వాడీల గ్రాట్యూటీపై ప్రశ్న రాగా కేంద్రానికి లేఖ రాశామని చెప్పి అక్కడికి తనకేమాత్రం బాధ్యత లేనట్లు తప్పించుకుంది. ఒక చేత్తో కేంద్రం ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో స్వాగతించిన ప్రభుత్వం మరో చేత్తో తమ ప్రభుత్వంలో పని చేస్తున్న అంగన్‌వాడీ మహిళలపై ఉక్కుపాదం మోపడాన్ని బట్టి సర్కారీ దమన నీతి అర్థమవుతుంది. అంగన్‌వాడీ మహిళలందరూ గిరిజన, దళిత, బిసి, పేదలే. వారి నోరు నొక్కి సామాజిక న్యాయం సాధిస్తామనడం ప్రభుత్వ కపట ప్రేమను తెలుపుతుంది.

అంగన్‌వాడీ ఉద్యోగులది సుదీర్ఘ పోరాటం. పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు తెలంగాణలో ఇచ్చే దానికంటే వెయ్యి ఎక్కువిస్తామని హామీ ఇచ్చారు. 2021 పే రివిజన్ దగ్గర నుంచి తెలంగాణ సర్కారు వర్కర్లకు నెలకు రూ.13,650, హెల్పర్లు, ఆయాలకు 7,800 ఇస్తోంది. మన దగ్గర మాత్రం రూ.11,500, రూ. 7 వేలు మాత్రమే ఇస్తున్నారు. అక్కడికంటే వెయ్యి ఎక్కువిస్తామన్నారు కదా అని అడిగితే ప్రభుత్వం నుంచి జవాబు లేదు. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని సాక్షాత్తు సుప్రీంకోర్టే చెప్పింది. అటు కేంద్ర ప్రభుత్వంలో ఇటు రాష్ట్ర ప్రభుత్వంలో ఆ ఊసే లేదు. అంగన్‌వాడీలు తమకు రిటైర్మెంట్ బెనిఫిట్లు, ధరలకనుగుణంగా జీతాలు, ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న సెంటర్లకు అద్దెలు, టిఎ బకాయిలు, పెరిగిన ధరలకనుగుణంగా 'జగనన్న సంపూర్ణ పోషణ' మెనూ చార్జీలు, గ్యాస్ ఖర్చులు ఇవ్వాలని అడుగుతున్నారు. ఫేస్ యాప్‌లు, పనిభారం తగ్గించమంటున్నారు. ఇవేమీ గొంతెమ్మ కోర్కెలు కాదు. అడగటమే నేరమన్నట్లు అంగన్‌వాడీలపై సర్కారు నిర్బంధాలకు పాల్పడటం ప్రజాస్వామ్య విరుద్ధం. అంగన్‌వాడీల వేతనాలు ఎప్పుడో 2011లో యుపిఎ-2 హయాంలో వర్కర్లకు 3 వేలు, ఆయాలు, హెల్పర్లకు 1,500 అయ్యాయి. అప్పటి నుంచి పెరగలేదు. మోడీ 2018 ఎన్నికల ముందు పెంచుతామన్నా అమలు కాలేదు. పైగా నూతన విద్యావిధానం, ప్రైవేటీకరణ, నిధుల కోతలతో మోడీ సర్కారు ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయబూనింది. గర్భిణులకు, బాలింతలకు, బాలలకు కాస్తంత ఆహారం అందిస్తున్న పథకం బక్కచిక్కితే పేదలకే నష్టం. అంగన్‌వాడీల డిమాండ్లు వాళ్ల వ్యక్తిగతం కాదు. భావి భారతానిది. ప్రజలందరూ వారి పోరాటానికి మద్దతు పలకాల్సిన అవసరం ఉంది. తెలుగునాట అంగన్‌వాడీల వీరోచిత పోరాటానికి ఘన చరిత్రే ఉంది. నాడు ఉమ్మడి రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా సాగిన పోరే కడకు ఆ ప్రభుత్వ పతనానికి నాంది అయింది. వైసిపి ప్రభుత్వం ఆ గుణపాఠాన్ని గుర్తెరిగి మసలుకోవాలి.

మహనీయుల మాట

ఒక దేశ భవిష్యత్తును అంచనా వేయాలంటే అక్కడి విద్యా విధానాలను పరిశీలించి చూస్తే చాలు.

- పి.బి.షెల్లీ, బ్రిటిష్ రచయిత.

ఆహార పదార్థాల ధరలు - ద్రవ్యోల్బణం

ప్రభాత్ పట్నాయక్

దేశంలో ఆహార పదార్థాల ధరలు తక్కిన వస్తువుల ధరలకన్నా ఎక్కువగా పెరుగుతున్నాయి. జులై 2023లో అన్ని వస్తువుల ద్రవ్యోల్బణం మొత్తంగా 7.44 శాతం ఉంది (గతేడాది జులై నెలతో పోల్చితే). ఆహారధాన్యాలు, కాయగూరలు, పాల ఉత్పత్తులు, తదితర ఆహార పదార్థాల ధరల ద్రవ్యోల్బణం విడిగా చూస్తే 11.5 శాతం ఉంది. టమాటా వంటి కొన్నింటి ధరలు అసాధారణంగా పెరిగినందువలన వాటిని అధికంగా సరఫరా చేసేవిధంగా కొన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంది. దాని వలన ఆగస్టులో ఈ ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలోకి వచ్చింది. మొత్తం ద్రవ్యోల్బణం కూడా 6.83 శాతానికి తగ్గింది. అయినప్పటికీ వినిమయ వస్తువుల ధరల పెరుగుదల, అందునా ఆహార ధరల పెరుగుదల ఇంకా ఒక తీవ్ర సమస్యగానే ఉంది.

ఆహార ధరలు ఈ విధంగా వేగంగా పెరిగిపోతూ వుండడం అనేది కేవలం భారత దేశానికే ప్రత్యేకించిన సమస్యగా లేదు. మూడవ ప్రపంచ దేశాలన్నింటితోబాటు సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో సైతం ఇది సమస్యగానే ఉంది. ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన ధోరణి ఇది. మామూలుగా అందరూ దీనికి ఉక్రెయిన్ యుద్ధం కారణం అంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా కొరత ఏర్పడిన మాట వాస్తవమే. కాని, ఇప్పుడు మనం చూస్తున్న ద్రవ్యోల్బణం యుద్ధం వలన వచ్చిన కొరత కన్నా, కొరత ఏర్పడబోతోందన్న ముందస్తు అంచనా ఫలితంగా వచ్చింది. యుద్ధం వచ్చిన తర్వాత వాస్తవంగా ఆహార ధాన్యాల సరఫరాలో కొరత ఇంకా ఏర్పడక ముందే ప్రపంచంలో ఆహార ధాన్యాల వ్యాపారంలో లాభాల రేటు చాలా దేశాల్లో పెరిగింది. ఇందుకు అనేక దాఖలాలు ఉన్నాయి. దీనిని బట్టి రాబోతున్న ఆహారధాన్యాల కొరతను దృష్టిలో ఉంచుకుని గుత్త వ్యాపార సంస్థలు ముందుగానే వాటి ధరలను పెంచేశారని స్పష్టం ఔతుంది. మన దేశంలో కూడా ఇదే జరిగింది. అందుకే చాలామంది "ద్రవ్యోల్బణం మీద ముందస్తు అంచనాలు" ధరల పెరుగుదలకు దోహదం చేశాయని అంటున్నారు.

ఐతే ద్రవ్యోల్బణం బాగా పెరగవచ్చునన్న అంచనాలు ఎప్పుడు వేయగలుగుతారు? వాస్తవంగా సరుకుల కొరత లేకున్నా, కొరత ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు అటువంటి అవకాశం ఉంటుంది. అంటే ప్రస్తుతం కొరత లేకున్నా, సరుకుల నిల్వలు పెద్దగా లేనప్పుడు సమీప భవిష్యత్తులో వాటికి కొరత ఏర్పడుతుంది అని అంచనా వేసే వీలుంటుంది. కాని, ఆహారధాన్యాల నిల్వలు భారీగా ఉన్నప్పుడు ఎవరైనా సరుకుల కొరత ఏర్పడుతుంది అన్న అంచనాకు వస్తారా? ప్రభుత్వం దగ్గరే భారీగా నిల్వలు ఉన్నప్పుడు మార్కెట్లో ఆహారధాన్యాల ధరలు పెరిగితే ప్రభుత్వం ఆ పెరుగుదలను అదుపు చేయడానికి తనవద్దనున్న నిల్వలను వినియోగదారులకు తక్కువ ధరలకు అందించి వాటి ధరలు బహిరంగ మార్కెట్లో పెరగకుండా నిరోధిస్తుంది. ఒకవేళ ప్రైవేటు వ్యాపారుల దగ్గరే నిల్వలు పేరుకుపోతే అప్పుడు వాళ్ళు ప్రధానంగా ఆ నిల్వలను తగ్గించుకోవడం మీద దృష్టి పెడతారే తప్ప వాటి ధరలను పెంచడం మీద కాదు. ఒకవేళ వాళ్ళలో ఎవరైనా ఆహారధాన్యాల ధరలను పెంచితే, తక్కినవాళ్ళు వినియోగదారులను తమవైపు తిప్పుకోడానికి పూనుకుంటారు. ఆ క్రమంలో తమ వద్ద పేరుకుపోయిన నిల్వలను తగ్గించుకుంటారు. అందుచేత ఆహారధాన్యాల సరఫరా తగినంత మోతాదులో లేని పరిస్థితుల్లో మాత్రమే వాటి ధరలు పెరుగుతాయని ముందస్తు అంచనాలకు రావడం వీలౌతుంది. ప్రపంచం మొత్తం మీద తలసరి తృణధాన్యాల ఉత్పత్తి 1980-82 మధ్య కాలంలో 355 కిలోలు ఉండేది. 2000-2002 నాటికి అది 343 కిలోలకు పడిపోయింది. 2016-18 మధ్య కూడా అది 344 కిలోలుగా మాత్రమే ఉంది. పైగా, 2002 నుండీ ఈ తృణధాన్యాలలో గణనీయమైన భాగం ఎథనాల్ ఉత్పత్తికి మళ్ళించడం ప్రారంభించారు. అంటే తలసరి ఆహారధాన్యాల లభ్యత తగ్గిపోయింది అని స్పష్టం అవుతోంది.

అలా ఆహారధాన్యాల లభ్యత తగ్గిపోతూ వస్తున్నా, వాటి ధరలు ఇటీవలి వరకూ పెద్దగా పెరిగింది లేదు. దానికి కారణం ఏమిటి? నయా ఉదారవాద విధానాలు శ్రామిక ప్రజల కొనుగోలు శక్తిని, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో, బాగా దెబ్బ తీశాయి. దాంతో ఒక పక్క ఆహారధాన్యాల లభ్యత తగ్గుతూ వున్నా, మరోవైపు వాటిని కొనుగోలు చేయగల శక్తి కూడా తగ్గిపోతూ వచ్చింది. అందుకే, పేదరికం పెరుగుతున్నా, పౌష్టికాహార లభ్యత తగ్గుతున్నా, ఆహారధాన్యాల ధరలు పెద్దగా పెరగలేదు. అప్పుడప్పుడూ ఆహారధాన్యాల ధరలు పెరిగినా, వాటిని అదుపు చేయడానికి శ్రామిక ప్రజల కొనుగోలు శక్తిని మరింత కుదించడమే పరిష్కారంగా పాలక వర్గాలు పరిగణిస్తూ వచ్చాయి. అంటే ధరలు పెరిగినప్పుడు సరుకుల సరఫరాను పెంచడం బదులు, వాటి డిమాండ్‌ను తగ్గించడం ద్వారా మార్కెట్లో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి సిద్ధపడ్డారన్నమాట.

భారతదేశంలో సరిగ్గా ఇదే జరిగింది. 1991లో ఆహార ధాన్యాల తలసరి, రోజువారీ లభ్యత 510.1 గ్రాములు. 2019-20 నాటికి ఇది కొద్దిగా తగ్గి 501.8 గ్రాములకు చేరింది. ఆ తర్వాత కరోనా కాలంలో ప్రభుత్వం తన వద్దనున్న నిల్వల నుండి ప్రజలకు పంపిణీ చేపట్టింది. ఫలితంగా ఆ తర్వాత రెండు సంవత్సరాలలో వరసగా 511.7 గ్రాములకి, 514.6 గ్రాములకి లభ్యత పెరిగింది. ఈ రెండేళ్ళూ మినహాయిస్తే తక్కిన నయా ఉదారవాద కాలం అంతా తలసరి ఆహారధాన్యాల లభ్యతలో పెరుగుదల ఏమీ లేదు. అటు లభ్యతా పెరగలేదు, ఇటు వాటి ధరలూ పెరగలేదు. శ్రామిక ప్రజల కొనుగోలు శక్తిని కుదించడం ద్వారా ఆహారధాన్యాల డిమాండ్ పెరగకుండా పాలకులు చూసుకున్నారు. తద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి ఎక్కువ ఆహారధాన్యాలను ప్రజలకు అందించాలంటే అప్పుడు ప్రభుత్వం ఎఫ్‌సిఐ ద్వారా మరింత ఎక్కువగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకోవలసి వస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో 5 కోట్ల 21 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఈ పని చేస్తే తప్ప ప్రస్తుత ఆహారధాన్యాల ధరల పెరుగుదలను నియంత్రించడం సాధ్యం కాదు.

మోడీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత వైఖరి ప్రభుత్వ నిల్వలు తరిగిపోవడానికి దారి తీసింది. బహిరంగ మార్కెట్ లోకి నిల్వలను విడుదల చేస్తే ఆహారధాన్యాల సరఫరా పెరిగి వాటి ధరలు తగ్గుతాయని ప్రభుత్వం భావించింది. కాని ఆ నిల్వలను స్పెక్యులేటర్లు చేజిక్కించుకుని తమ వద్ద దాచుకున్నారు. దాని వలన ద్రవ్యోల్బణం యథావిధిగా కొనసాగింది. పైగా ప్రభుత్వ నిల్వలు తగ్గిపోవడంతో ధరలు మరింత పెరుగుతాయన్న ముందస్తు అంచనాలు బలపడ్డాయి. ఒకసారి ఆహారధాన్యాల ధరలు పెరగడం మొదలైతే తక్కిన ఆహార పదార్థాల ధరలు కూడా పైకి ఎగబాకడం ప్రారంభిస్తాయి.

ఐతే ఈ విధమైన అదుపు ఎప్పుడైనా దెబ్బ తినవచ్చు. అప్పుడు ఆహారధాన్యాల ధరలు పెరగడం ప్రారంభిస్తాయి. దాని ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. నయా ఉదారవాదం ద్రవ్యోల్బణానికి వ్యతిరేకం. అందుచేత దానిని అదుపు చేయడానికి అది శ్రామిక ప్రజల కొనుగోలు శక్తిని మరింత కుదించడానికి సిద్ధపడుతుంది. ఉక్రెయిన్ యుద్ధమూ, ప్రపంచ వ్యాప్తంగా ఆహారధాన్యాల ధరలు పెరగడమూ మన దేశంలో కూడా వాటి ధరలు పెరుగుతాయన్న ముందస్తు అంచనాలు ఏర్పడడానికి దోహదం చేశాయి. దానికి తోడు కేంద్ర ప్రభుత్వం దగ్గరున్న ఆహారధాన్యాల నిల్వలు (ఇప్పటికీ అవసరాలకు మించి ఉన్నప్పటికీ) కొంత కాలం ముందున్నంత హెచ్చు స్థాయిలో ప్రస్తుతం లేవు. గత ఆరేళ్లలో ఉన్న నిల్వలతో పోల్చితే 2023 ఆగస్టు నాటికి ఉన్న నిల్వలు తగ్గిపోయాయి. 5 కోట్ల 23 లక్షల 35 వేల టన్నుల నిల్వలు మాత్రం ఉన్నాయి. ఈ నిల్వలు మన ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకన్నా ఎక్కువే. ఐనప్పటికీ, గత ఆరేళ్ళ కాలంలో ఉండిన నిల్వల కన్నా తక్కువ. అందుచేత స్పెక్యులేటర్లకు వాటి ధరలు పెరగవచ్చునన్న అంచనాలు ఏర్పడి వాటి నిల్వలను పెంచుకునేవిధంగా నడిపించాయి.

మోడీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత వైఖరి ప్రభుత్వ నిల్వలు తరిగిపోవడానికి దారి తీసింది. బహిరంగ మార్కెట్ లోకి నిల్వలను విడుదల చేస్తే ఆహారధాన్యాల సరఫరా పెరిగి వాటి ధరలు తగ్గుతాయని ప్రభుత్వం భావించింది. కాని ఆ నిల్వలను స్పెక్యులేటర్లు చేజిక్కించుకుని తమ వద్ద దాచుకున్నారు. దాని వలన ద్రవ్యోల్బణం యథావిధిగా కొనసాగింది. పైగా ప్రభుత్వ నిల్వలు తగ్గిపోవడంతో ధరలు మరింత పెరుగుతాయన్న ముందస్తు అంచనాలు బలపడ్డాయి. ఒకసారి ఆహారధాన్యాల ధరలు పెరగడం మొదలైతే తక్కిన ఆహార పదార్థాల ధరలు కూడా పైకి ఎగబాకడం ప్రారంభిస్తాయి.

ఆహారధాన్యాల ధరలను నియంత్రించడానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది: ప్రభుత్వం ద్రవ్య విధానాన్ని తగువిధంగా మార్పు చేయడం. ఇందులో వడ్డీ రేట్లను పెంచడం, రుణ లభ్యతను అదుపు చేయడం అనే రెండు చర్యలు ఉంటాయి. పాత రోజుల్లో ఇటువంటి సందర్భాలలో ఆహారధాన్య వ్యాపారులకు మాత్రమే రుణ లభ్యతను అదుపు చేసేవారు. దాని ఫలితంగా వారు ఎక్కువ నిల్వలను ఉంచుకోవడం సాధ్యపడేది కాదు. అప్పుడు ఆహారధాన్యాల ధరలు తగ్గేవి. కాని ప్రస్తుత నయా ఉదారవాద కాలంలో కొన్ని తరగతుల వ్యాపారులకు మాత్రమే నియంత్రణ అమలు చేయడం సాధ్యం కాదు. అందుచేత అందరికీ రుణ లభ్యతను అదుపు చేయాల్సి వుంటుంది. దీని వలన చిన్న, మధ్య తరహా పెట్టుబడిదారులు ఎక్కువగా దెబ్బ తింటారు. అది నిరుద్యోగం మరింత పెరగడానికి దారి తీస్తుంది. దాని వలన ప్రజల కొనుగోలు శక్తి మొత్తం మీద చూసినప్పుడు తగ్గిపోతుంది. అంటే ఆహారధాన్యాలకు డిమాండ్ తగ్గుతుంది. దానివలన ద్రవ్యోల్బణం తగ్గుతుంది. నయా ఉదారవాదం ద్రవ్యోల్బణానికి చూపించే పరిష్కారం ఇదే.

ఇక రెండో పద్ధతి: ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించడం. అప్పుడు ప్రభుత్వం దగ్గరున్న నిల్వలు బహిరంగ మార్కెట్ లోకి కాకుండా నేరుగా ప్రజలకు చేరుతాయి. అప్పుడు నిల్వలు స్పెక్యులేటర్లకు అందుబాటులోకి లేకుండా పోతాయి. వినియోగదారులు బహిరంగ మార్కెట్ నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ వైపు మరలుతారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి ఎక్కువ ఆహారధాన్యాలను ప్రజలకు అందించాలంటే అప్పుడు ప్రభుత్వం ఎఫ్‌సిఐ ద్వారా మరింత ఎక్కువగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకోవలసి వస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో 5 కోట్ల 21 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఈ పని చేస్తే తప్ప ప్రస్తుత ఆహారధాన్యాల ధరల పెరుగుదలను నియంత్రించడం సాధ్యం కాదు. ఎంతో అపఖ్యాతిని ఆర్జించిన నల్ల వ్యవసాయ చట్టాలు ఎంత పనికిమాలినవో ఇప్పుడు బాగా బోధపడుతుంది. రైతులంతా ఉద్యమించి ఆ చట్టాలను రద్దు చేసేవరకూ పోరాడారు గనుక సరిపోయింది. అలా కాకుండా, ఆ చట్టాలే అమలులో ఉండినట్టైతే మొత్తం దేశంలోని ఆహార ధాన్యాలన్నీ ప్రైవేటు రంగం గుప్పెట్లో ఇరుక్కుపోయి వుండేవి. అప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ప్రభుత్వానికి అసాధ్యం అయివుండేది. రైతుల పోరాటం ఈ దేశాన్ని కాపాడింది. అందువల్లే ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రస్తుతానికి బతికి బట్ట కట్టింది.

(స్వేచ్ఛానుసరణ)



జిపిఎస్ - ఉద్యోగుల జీవితాలకు ఉరి

ఎస్.పి.మనోహర్ కుమార్

ఆంధ్రప్రదేశ్‌లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేస్తానన్న మాట అమలు కోసం గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి ఉద్యోగి ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కనీసం ఎన్నికల ముందయినా ఇచ్చిన మాటను నిలబెట్టు కొంటారన్న ఆశ, ఇప్పుడు అడుగంటిపోయింది. మానిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన మొదటి హామీనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని. హామీని నిలబెట్టుకోక పోవడంతో...ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

గత ఎన్నికల ముందు 2018 డిసెంబర్ 11న శ్రీకాకుళం జిల్లాలో జరిగిన పాదయాత్ర సందర్భంగా "మేం ఎన్నికల్లో గెలిస్తే ఉద్యోగులు కోరుకున్న విధంగా సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇస్తున్నాం" అని వైఎస్ జగన్ అన్నారు. కానీ నేడు "సిపిఎస్ రద్దు చేస్తున్నాం. గ్యారంటీ పెన్షన్ స్కీమ్ ప్రవేశపెడుతున్నాం. రిటైర్మెంట్ నాటి బేసిక్ వేతనం మీద 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నాం. ఇది దేశానికే ఆదర్శం కాబోతోంది" అని ఎ.పి.ఎన్.జి.వోల సమావేశంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రకటించడంతో...ఇక ఈ ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోలేదని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి అర్థమైంది. తాజా క్యాబినెట్ భేటీలో కొత్త పెన్షన్ స్కీమ్‌ను ప్రవేశపెడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల హామీకి భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు. అయితే, పాత పెన్షన్ స్కీమ్ (ఒ.పి.ఎస్) పున:ప్రవేశ పెట్టడం పెనుభారంగా మారుతుంది కాబట్టి కొత్త విధానం తీసుకొచ్చినట్టు ప్రభుత్వం చెబుతోంది. ఈ శాసన సభ సమావేశాలలో గ్యారంటీ పెన్షన్ విధానం (జిపిఎస్) బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రస్తుతం అమలులో ఉన్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను 2003 నుంచి అమలు చేస్తున్నారు. 2004 జనవరి 1 నుంచి విధుల్లో చేరుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు దీనిని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి తన వేతనం నుంచి 10 శాతం, దాంతో సమానంగా ప్రభుత్వం తరపున వాటా కూడా చెల్లిస్తారు. అంతకు ముందు రిటైరైన ఉద్యోగులందరికీ ప్రభుత్వమే పెన్షన్ చెల్లించేది. కానీ సిపిఎస్ వచ్చిన నాటి నుంచి సిబ్బంది తాము దాచుకున్న మొత్తం పెన్షన్ నిధిగా లెక్కిస్తూ నేషనల్ పెన్షన్ స్కీం-ఎన్‌పిఎస్ ట్రస్టు, నేషనల్ సెక్యూరిటీ డిపాజిటరీ లిమిటెడ్-ఎన్‌ఎస్‌డిఎల్ ద్వారా షేర్ మార్కెట్‌లో మదుపు చేస్తారు. ఉద్యోగి, ప్రభుత్వం వాటాగా జమ చేసిన మొత్తం షేర్ మార్కెట్ ఆధారంగా పెన్షన్ చెల్లింపు జరుగుతుంది. దీని మీద తీవ్ర వ్యతిరేకత వస్తోంది. అనేక రాష్ట్రాల్లో ఉద్యోగుల ఆందోళనలతో ప్రభుత్వాలు సిపిఎస్ రద్దు చేసి తిరిగి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించాయి.

సిపిఎస్ లో పెన్షన్ గ్యారంటీ లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తుండడం వల్ల వారికి పెన్షన్ గ్యారంటీ చేసే విధానం తాము తీసుకొచ్చామని ఎ.పి ప్రభుత్వం అంటోంది. ఉద్యోగుల డిమాండ్ మేరకు సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని తాము ఈ నిర్ణయం తీసుకున్న ఎ.పి ప్రభుత్వం చెబుతోంది.

ఎ.పి గ్యారంటీడ్ పెన్షన్ బిల్లు 2023 పేరుతో దీనిని పేర్కొంది. ఎ.పి క్యాబినెట్ ఆమోదించడంతో త్వరలోనే చట్టం అవుతుంది. ఎ.పి లో ప్రస్తుతం సి.పి.ఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులు దాదాపు 3 లక్షల మంది ఉన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అత్యధికులకు ప్రస్తుతం సి.పి.ఎస్ అమలవుతోంది. దాని స్థానంలో ప్రవేశపెడుతున్న జిపిఎస్ కారణంగా ఉద్యోగులకు పెన్షన్ గ్యారంటీ అవుతుందని, దానివల్ల సమస్య తీరినట్టేనని ప్రభుత్వం అంటోంది. పాత పెన్షన్ విధానంలో ఎటువంటి కంట్రిబ్యూషన్ చెల్లించని ఉద్యోగి సిపిఎస్ విధానంలో కాంట్రిబ్యూషన్ చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదించిన గ్యారంటీ పెన్షన్ స్కీంలో కూడా కంట్రిబ్యూషన్ చెల్లించాల్సిందే. అంటే సిపిఎస్ జిపిఎస్‌గా మారింది తప్ప ప్రభుత్వం చెబుతున్న గ్యారంటీ పెన్షన్ లేదని అర్థం అవుతుంది. పేరు మార్చారు తప్ప విధానాల్లో మార్పు లేదు. ఉద్యోగులు తన బేసిక్ పే, డి.ఎ నుంచి 10 శాతం కంట్రిబ్యూట్ చేస్తూనే ఉండాలి. ప్రభుత్వ వాటా సంగతి స్పష్టత లేదు. పెన్షన్ నిధిని ఎన్‌ఎస్‌డిఎల్‌కు జత చేయడం మానేస్తామని చెబుతున్నారు. గ్రాట్యూటీ చెల్లింపు లేదు. ఉద్యోగుల పెన్షన్ నుంచి ట్యాక్స్ వసూలు చేస్తారు. ఇది ప్రభుత్వానికి భారం తగ్గించుకునే ప్రయత్నంగానే ఉంది. ఉద్యోగులకు దీనివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు.

'రాజస్థాన్, చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ సహా వివిధ రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆయా రాష్ట్రాలలో ఉద్యోగుల కంట్రిబ్యూషన్ కటింగ్ ఆగిపోయింది. ఎ.పి ప్రభుత్వం మాత్రం విధానపరంగా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో కనిపించడం లేదు. సిపిఎస్ రద్దు విషయంలో చిత్తశుద్ధి లేదు. దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలతో పాటుగా వైసిపి కూడా సిపిఎస్ రద్దుకి సిద్ధంగా లేనట్టు కనిపిస్తోంది. పేరు మారుస్తున్నప్పటికీ జిపిఎస్‌లో కూడా అనేక సమస్యలున్నాయి. రిటైర్మెంట్ తర్వాత బేసిక్‌లో సగం మాత్రమే పెన్షన్ అని చెప్పడం ద్వారా ఉద్యోగుల ఆశలను నిలువునా కూల్చేసిన పరిస్థితి ఏర్పడింది.

సిపిఎస్‌లో తీవ్ర అన్యాయం జరగడం వల్లనే ఉద్యమం వచ్చింది. నేడు ఆ ఉద్యమాన్ని నీరుగార్చుతూ ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడడం, ప్రభుత్వ విధానానికి బాజా భజంత్రీలుగా మారి ఉద్యమ బండిని పక్కదారి పట్టించిన నాయకులకు కూడా బొప్పి కట్టే పరిస్థితి వస్తుందని ఆయా నాయకత్వాలు గమనిస్తే మంచిది. ఉపాధ్యాయ సంఘాలతో పాటుగా సాధారణ ప్రభుత్వ ఉద్యోగులలో కూడా కొత్త విధానం పట్ల పూర్తిస్థాయి అసంతృప్తి వ్యక్తమైంది.

అవసరమైతే గ్యారంటీ పెన్షన్ విధానంలో ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌ను 10 శాతం నుంచి 14 శాతానికి పెంచుతామని, దీనితో చివరి నెల వేతనంలో 50 శాతం పెన్షన్ వస్తుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కంట్రిబ్యూషన్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేస్తేనే అంగీకరిస్తామని ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నాయి. పేరు మార్చి గ్యారంటీ అన్నంత మాత్రాన దీనిని అంగీకరించేది లేదని పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం తను హామీ ఇచ్చినట్లు పాత పెన్షన్‌ను అమలు చేయకుండా, సిపిఎస్ స్థానంలో గ్యారంటీ పెన్షన్ స్కీంను చట్టంగా అమోదించేస్తే, దాని ప్రభావం 2024 ఎన్నికల సమయంలో రాజకీయ ముఖచిత్రంపై కనిపించవచ్చు.

/ వ్యాసకర్త ఎ.పి.యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి,
సెల్ : 9490762412 /

ప్రజా రంజక ఉత్తర కొరియా పాలనతో పోలికా?

తెలుగు దేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఒక సమావేశంలో ఆంధ్ర రాష్ట్రంలో ఉత్తర కొరియా తరహా పాలన సాగుతోందని పోల్చారు.

ఉత్తర కొరియా ఒక సోషలిస్టు దేశం. అంటే శ్రామికుల రాజ్యం. కష్టపడేవారి తరపున నిలబడే ప్రభుత్వం. ఆ శ్రామిక రాజ్యాన్ని కూల్చాలని కుట్రలు పన్నే బడా పెట్టుబడిదారుల భరతం పట్టడానికి, ఆ కుట్రలను భగ్నం చేయడానికి అన్ని రకాలుగా ప్రయత్నించి, ఆ శ్రామిక రాజ్యాన్ని కాపాడుకోవడం అక్కడి ప్రభుత్వ బాధ్యత. అప్పుడు మాత్రమే అనేక మంది త్యాగాలతో ఏర్పడిన ఆ సోషలిస్టు రాజ్యాన్ని ఎలాగైనా కూల్చేసి, తిరిగి దోపిడీ పాలనను రుద్దాలనే దుష్టుల నుండి కాపాడుకోవడం సాధ్యం. అదే సందర్భంలో ప్రపంచ మార్కెట్లన్నింటినీ కబళించాలని బరితెగించి, విర్ర వీగుతున్న అమెరికా సామ్రాజ్యవాద ఎత్తుగడల నుండి కూడా తనని తను కాపాడుకోవడం ఆ దేశానికి సాధ్యం. ఈ రెండు కర్తవ్యాలను ఆ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తోంది. అదే సందర్భంలో తన దేశంలోని సుమారు 2 కోట్ల 60 లక్షల మంది ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా తన విధానాలను రూపొందించు కుంటోంది.

ఆ దేశంలో విద్య, వైద్యం అందరికీ ఉచితం. ఆహారం, గృహ వసతి అత్యంత సబ్సిడీ ధరలకు ప్రభుత్వం అందిస్తోంది. ప్రజలు వాడే ఏ సరుకు మీదా ఏ రకమైన పన్నులూ అక్కడ లేవు. మన దేశంతో బాటు, అమెరికా లాంటి బాగా అభివృద్ధి చెందిన దేశాలు సైతం కకావికలం కావడానికి కారణమైన కోవిడ్ మహమ్మారిని తన దరిదాపులకు కూడా రాకుండా చేసింది. ఆ దేశ కమ్యూనిస్టు ప్రభుత్వం తన ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలబడడమే కాకుండా, అనేక దేశాలకు సహాయకారిగా నిలిచింది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఉత్తర కొరియాలోని ప్రభుత్వం అత్యధికమంది ప్రజల తరపున నికరంగా నిలబడి, ఆ ప్రజానుకూల ప్రభుత్వాన్ని కూల్చేయాలని కుట్రలు పన్నుతున్న దుష్టుల పట్ల సింహ స్వప్నంగా ఉంటోంది. ఇంకో మాటలో చెప్పాలంటే ఆ దేశంలో అత్యధిక మంది ప్రజలకు ప్రజాస్వామ్యం, దుష్టులకు నియంతృత్వం అమలవుతోంది. దేశంలోను, బయట నుండి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా, ఇటువంటి ప్రజానుకూల పాలనను అక్కడి ప్రభుత్వం అందిస్తోంది.

నారా లోకేష్ నేడు ఆంధ్ర రాష్ట్రంలోని పాలనను ఉత్తర కొరియా పాలనతో పోల్చడమంటే, అంత ప్రజా రంజక పాలన ఇక్కడ కూడా సాగుతోందనా? లేక తెలుగుదేశం అధ్యక్షులను అరెస్టు చేసి జైల్లో పెట్టించడం ఉత్తర కొరియాలో ప్రభుత్వం దుష్టులను శిక్షించడంతో పోలికా? అలాగైతే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనకు మంచి సర్టిఫికెట్ ఇచ్చినట్లే. ఇదే లోకేష్ ఉద్దేశమా? ఒక్కోసారి మాట్లాడే మాటలు, పోల్చే పోలికలు సక్రమంగా లేకపోతే సెల్ఫ్ గోల్ వేసుకున్నట్లే అవుతుంది. ఏమైనా ఈయన పోలిక అర్థ రహితం, అసంబద్ధం. నేడు రాష్ట్రంలో అనేక తరగతుల ప్రజలపై తీవ్ర నిర్బంధం సాగుతోంది. తన దాకా వస్తేనే కానీ తెలీదన్నట్లు కాకుండా, రాష్ట్రం లోని నేటి అన్ని రకాల, తాజాగా అంగన్‌వాడీలపై నిర్బంధాలను కూడా ఖండించడం సముచితంగా ఉంటుంది.

- ఎ. అజ శర్మ,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక
ప్రధాన కార్యదర్శి.

కదంతొక్కిన కష్టజీవులు

- ఉపాధి, ఆహారం, సామాజిక భద్రత కోసం కొల్‌కతాలో వ్యవసాయ కార్మిక సంఘం భారీ బహిరంగ సభ
- రూ.600 వేతనంతో ఏడాదికి 200 రోజుల 'ఉపాధి' కల్పించాలి
- విజయరాఘవన్, వెంకట్ డిమాండ్
- కార్పొరేట్ మతోన్మాద ఆటవిక విధానాలను ఓడించాలని పిలుపు

బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన వ్యవసాయ కార్మికులు (ఇన్‌సెట్‌లో ప్రసంగిస్తున్న ఎ విజయ రాఘవన్, బి వెంకట్)

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - కొల్‌కతా

కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వ విధానాలకు, బెంగాల్‌లో మమత బెనర్జీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ ఆటవిక విధానాలకు వ్యతిరేకంగా వేలాది మంది కష్టజీవులు కలకత్తా వీధులలో కదం తొక్కారు. బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ కుట్రలను ఎర్రజెండా అండతో అడ్డుకుందామంటూ గొంతెత్తి నినదించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కొల్‌కతాలో కష్టజీవుల మహాప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎడబ్ల్యుయు జాతీయ అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ విజయ రాఘవన్, బి వెంకట్, పార్లమెంటు సభ్యులు వికాసరంజన్ తదితరులు ప్రసంగించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.600 వేతనంతో ఏడాదికి కనీసం 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ఆహార ధాన్యాలను ప్రజలకు ఉచితంగా అందజేయాలని కోరారు. పేదలందరికీ ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, సామాజిక ఫించన్లు అందజేయాలని డిమాండ్ చేశారు.

తృణమూల్ ప్రభుత్వం అనేక ఆటంకాలు సృష్టించి, పోలీసులతో తీవ్ర నిర్బంధానికి పాల్పడినా..వాటన్నిటినీ లెక్కచేయకుండా వేలాదిగా తరలివచ్చిన కష్టజీవులకు వారు అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించుకోవాలంటే కేంద్రంలో మోడీని, బెంగాల్‌లో మమత బెనర్జి ఓడించితీరాలని పిలుపునిచ్చారు. తృణమూల్ అవినీతి పాలనతో బెంగాల్‌లో ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల జాబు కార్డులన్నీ తమ కబంధహస్తాల్లో దాచుకొని 'ఉపాధి' నిధులను పందికొక్కుల్లా తృణమూల్, బిజెపి నేతలు దిగమింగుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీనివల్ల పేదలు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి, తృణమూల్ జోడిగా బెంగాల్ ప్రజలను బలి పశువులను చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 11న బెంగాల్ గ్రామీణ ప్రాంతాన్నంత స్తంభింపచేస్తామని, జిల్లా స్థాయిలో, బ్లాక్ స్థాయిలో దిగ్బంధనాలకు దిగుతామనిహెచ్చరించారు.

వ్యవసాయ రంగంలోనూ బెంగాల్ అట్టడుగు స్థానానికి చేరిందని, దేశ జిడిపిలో 25% వ్యవసాయ రంగం నుండి వస్తుంటే బెంగాల్‌లో కేవలం 16 శాతం వస్తోందన్నారు. వామపక్ష ప్రభుత్వాలు గ్రామీణ పేదలకు లక్షలాది ఎకరాల భూములు పంచాయిని, పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాయని తద్వారా గ్రామీణ వ్యవసాయం నాడు సస్యశ్యామలంగా సాగిందని గుర్తు చేశారు. వ్యవసాయానికి ప్రసిద్ధిగాంచిన బర్ద్వాన్ లాంటి జిల్లాలోనూ రైతులు, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మతోన్మాద బిజెపి, అరాచక తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైందన్నారు. ప్రజల హక్కులను కాలరాస్తూ నిరంకుశ పాలన సాగిస్తున్న వీరిని ఓడించితీరితేనే దేశంలోనూ, పశ్చిమ బెంగాల్‌లోనూ ప్రజాస్వామ్య హక్కులకు మనుగడ సాధ్యమని తెలిపారు. ఈ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నేతలు అమియా పాత్ర, తోషార్ ఘోష్, రాష్ట్ర కార్యదర్శి మీరా ఫర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే కులగణన : రాహుల్ గాంధీ

బిలాస్‌పూర్ : తాము అధికారంలోకి వస్తే కుల ప్రాతిపదికన జన గణన నిర్వహిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో పర్యాద (సక్రి) గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఆవాస్ న్యాయ సమ్మేళన్'లో ఆయన ప్రసంగించారు. నిరాశ్రయులకు, గ్రామీణ ప్రాంతాల్లో కచ్చా ఇళ్లు వున్న కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు ఈ పథకం చేపట్టారు. జనాన్ని ఉద్దేశించి రాహుల్, రిమోట్ కంట్రోల్‌ను ఉపయోగించి ఈ పథకం కింద దీన్ని నొక్కితే నిరుపేదలు, అవసరంలో వున్నవారు లబ్ధిపొందుతారని అన్నారు. ఈ రోజున దీన్ని నొక్కగానే రూ.వేల కోట్ల రూపాయలు ఛత్తీస్‌గఢ్ ప్రజల ఖాతాల్లోకి చేరాయన్నారు. అదే పాలన బిజెపి చేస్తే అదానీకి ఓడరేవులు, విమానాశ్రయాలు, రైల్వే కాంట్రాక్టులు వస్తాయన్నారు. కాంగ్రెస్ ఈ రిమోట్ కంట్రోల్‌ను బహిరంగంగా నొక్కితే, బిజెపి రహస్యంగా చేస్తుందని విమర్శించారు. కులగణన చేపడితేనే దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసిలు), మహిళల ప్రాతినిధ్యం సాధ్యపడుతుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో వున్నపుడు నిర్వహించిన కుల గణన వివరాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎందుకు విడుదల చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. దీని పట్ల ప్రధాని మోడీకి భయం వుందేమో తాను తెలుసుకోవాలనుకుంటున్నానని చెప్పారు. ఒబిసిలు, దళితులు, గిరిజనులు, మహిళలకు కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే కుల గణన తప్పక నిర్వహించాల్సి వుంటుందన్నారు.

పబ్లిక్ నోటీసు

ICICI Home Finance

రిజిస్టర్డ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400051.
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్స్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి ఈస్ట్, ముంబాయి-400059
శాఖ కార్యాలయం: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010.

కింది రుణగ్రహీతలు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి) నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర. సం	రుణగ్రహీతలు/సహ రుణగ్రహీత/హామీదారులు యొక్క పేర్లు మరియు (లోన్ ఎకౌంట్ నెంబర్లు) మరియు చిరునామా	ఆస్తుల చిరునామా/ సెక్యూర్ ఆస్తులు/అమలు చేసిన అసెట్	నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఎ తేది
1.	నల్లజెరు శ్రీనివాసరావు (రుణగ్రహీత), నల్లజెరు వెంకట రమాదేవి (సహ-రుణగ్రహీత) 14/194-బి-1 ఎడెపల్లి మచిలీపట్నం కృష్ణ-521001. NHMCL00001272050	ఆర్ ఎస్ నం.241 1 2 రెవెన్యూ సర్వే వార్డు నం.4 మున్సిపల్ డో.నం.14 194 వద్ద, ఎడెపల్లి బందర్ తూర్పు మచిలీపట్నం 241 మచిలీపట్నం- 521106. హద్దులు : ఉత్తరం : మదనబోయిన సురేంద్ర, దక్షిణం: వాకముల్లు రాంబాబు, తూర్పు: 12 అ.లు. వెడల్పు ఉమ్మడి మార్గం, పడమర: నూతి వీరమ్మ.	12-12-2022 Rs. 8,20,071/-	04/12/ 2022
2.	నల్లజెరు శ్రీనివాసరావు (రుణగ్రహీత), నల్లజెరు వెంకట రమాదేవి (సహ-రుణగ్రహీత) 14/194-బి-1 ఎడెపల్లి మచిలీపట్నం కృష్ణ-521001. NHMCL00001272053	ఆర్ ఎస్ నం.241 1 2 రెవెన్యూ సర్వే వార్డు నం.4 మున్సిపల్ డో.నం.14 194 వద్ద, ఎడెపల్లి బందర్ తూర్పు మచిలీపట్నం 241 మచిలీపట్నం- 521106. హద్దులు : ఉత్తరం : మదనబోయిన సురేంద్ర, దక్షిణం: వాకముల్లు రాంబాబు, తూర్పు: 12 అ.లు. వెడల్పు ఉమ్మడి మార్గం, పడమర: నూతి వీరమ్మ.	12-12-2022 Rs. 4,53,646/-	04/12/ 2022
3.	నల్లజెరు శ్రీనివాసరావు (రుణగ్రహీత), నల్లజెరు వెంకట రమాదేవి (సహ-రుణగ్రహీత) 14/194-బి-1 ఎడెపల్లి మచిలీపట్నం కృష్ణ-521001. NHMCL00001272054	2 ఆర్ ఎస్ నం.241 1 2 రెవెన్యూ సర్వే వార్డు నం.4 మున్సిపల్ డో.నం.14 194 వద్ద, ఎడెపల్లి బందర్ తూర్పు మచిలీపట్నం 241 మచిలీపట్నం- 521106. హద్దులు : ఉత్తరం : మదనబోయిన సురేంద్ర, దక్షిణం: వాకముల్లు రాంబాబు, తూర్పు: 12 అ.లు. వెడల్పు ఉమ్మడి మార్గం, పడమర: నూతి వీరమ్మ.	12-12-2022 Rs. 8,22,376/-	04/12/ 2022

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేది: 26 సెప్టెంబర్, 2023
ప్రదేశం: విజయవాడ, మచిలీపట్నం

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

బీహార్‌లో అమానవీయం

- అధిక వడ్డీ చెల్లించలేదని
- మహిళపై దాడి
- మూత్ర విసర్జన

పాట్నా : బీహార్‌లోని పాట్నా జిల్లాలో అమానవీయ ఘటన చోటు చేసుకున్నది. తీసుకున్న అప్పునకు అధికనంత వడ్డీ చెల్లించలేదని, పైగా తమపై పోలీసులకు ఫిర్యాదు చేసిందనే ఆగ్రహంతో దళిత మహిళను వివస్త్రను చేసి దాడికి తెగబడ్డారు. అంతటితో ఆగలేదు. ఆమెపై మూత్ర విసర్జన కూడా చేశారు. హేయాతిహేయమైన ఈ ఘటన పాట్నాలోని మోసింపూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తీవ్రంగా స్పందించారు. మహిళపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక వడ్డీ వ్యాపారి ప్రమోద్ సింగ్ వద్ద బాధిత మహిళ భర్త 9 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పును, నిర్ణీత వడ్డీని తీర్చివేశాడు. అయినా ఈ అప్పుపై రూ. 1,500 అదనపు వడ్డీ చెల్లించాలని ప్రమోద్ సింగ్ డిమాండ్ చేశాడు. అధికనంత వడ్డీ ఇవ్వకుంటే గ్రామంలో వివస్త్రను చేసి ఊరేగిస్తానని ప్రమోద్ సింగ్ బాధితురాలను ఫోన్‌లో బెదిరించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఒక పోలీసు బృందం ఈ ఫిర్యాదు గురించి విచారించడానికి శనివారం గ్రామాన్ని సందర్శించింది. ఇది ప్రమోద్, అతని సహచరులకు కోపం తెప్పించింది. దీంతో శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఆమె ఇంటికి వెళ్లి బలవంతంగా ప్రమోద్ ఇంటికి లాక్కెళ్లారు. అక్కడ ఆమె బట్టలు విప్పి, కర్రలతో కొట్టారు. ప్రమోద్ అతని కుమారుడి చేత బాధితురాలు ముఖంపై మూత్రం పోయించాడు. ఏదో విధంగా అక్కడ నుంచి తప్పించుకున్న మహిళ ఇంటికి తిరిగి చేరుకుంది. దాడి అనంతరం ప్రమోద్ సింగ్, అతని కుమారుడు అన్షు సింగ్ పరారీలో ఉన్నారని పాట్నా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజీవ్ మిశ్రా తెలిపారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. "మేము ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేశాం. సోదాలు నిర్వహిస్తున్నాము" అని మిశ్రా తెలిపారు.

డానిష్ అలీతో మాట్లాడుతున్న బృందాకరత్, సుభాషిణి అలీ

బిఎస్‌పి ఎంపీకి సిపిఎం సంఘీభావం

న్యూఢిల్లీ : బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) నేత, అమ్రోహా ఎంపీ డానిష్ అలీకి సిపిఎం సంఘీభావం తెలియజేసింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణి అలీ ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడారు. డానిష్ అలీపై పార్లమెంటు నిండు సభలో బిజెపి ఎంపి రమేశ్ బిధూరి బరితెగించి దూషణల దాడికి దిగడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. తక్షణమే బిధూరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సందర్భాల్లో సిపిఎం నుంచి తనకు కచ్చితంగా మద్దతు లభిస్తుందని విశ్వసించానని, ఆ పార్టీ నాయకులు ఇంటికి వచ్చి సంఘీభావం తెలియజేసినందుకు సిపిఎంకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని డానిష్ తెలిపారు.

దేశంలో తొలి గ్రీన్ హైడ్రోజన్ బస్ ప్రారంభం

న్యూఢిల్లీ : దేశంలో తొలి గ్రీన్ హైడ్రోజన్ బస్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సోమవారం ఆవిష్కరించింది. ఇండియా గేట్ వద్ద కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి రెండు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. పునరుత్పాదక వనరులతో నడిచే ఈ బస్సులు ట్రయల్ రన్‌లో భాగంగా దేశ రాజధాని ప్రాంతంలో తిరుగుతాయి. ఒక బస్సులో 30 కిలోల సామర్థ్యం ఉన్న 4 సిలిండర్లు ఉంటాయి. వీటితో బస్సు సుమారు 350 కిమీ దూరం ప్రయాణం చేయగలదు.

ఇది చాలా తీవ్రమైన అంశం

- ముజఫర్‌నగర్ టీచర్ కేసు దర్యాప్తు తీరు పై సుప్రీం

న్యూఢిల్లీ : ముస్లిం విద్యార్థిని సహచర విద్యార్థులతో చెంపదెబ్బలు కొట్టించిన ఘటనలో ఉత్తరప్రదేశ్ పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల సుప్రీం కోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ కేసు ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, మతోన్మాద ఆరోపణలు తొలగించడం పట్ల ప్రశ్నలు లేవనెత్తుతూ, ఈ కేసు దర్యాప్తుకు సీనియర్ ఐపిఎస్ అధికారిని నియమించాల్సిందిగా యుపి ప్రభుత్వాన్ని బెంచ్ ఆదేశించింది. విద్యా హక్కు చట్ట ఆదేశాలను పరిరక్షించడంలో ప్రభుత్వం తరపున ప్రాథమికంగా వైఫల్యం జరిగినట్లు కనిపిస్తోందని కోర్టు వ్యాఖ్యలు చేసింది. విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్‌ను తక్షణమే నమోదు చేయలేదని బెంచ్ పేర్కొంది. సంఘటన జరిగిన దాదాపు రెండు వారాల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో మతోన్మాద ఆరోపణలు లేకపోవడాన్ని కూడా బెంచ్ తప్పుబట్టింది. ఒక ప్రత్యేక మతం పట్ల టీచర్ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిందనే సదరు విద్యార్థి తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారని, కానీ ఎఫ్ఐఆర్‌కు వచ్చేసరికి అవేమీ లేవని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇది చాలా తీవ్రమైన అంశమని అన్నారు. ఒక ప్రత్యేక మతానికి చెందిన వారనే కారణంతో సహచర విద్యార్థిపై చేయి చేసుకోమని చెప్పడం చాలా దారుణమని అన్నారు.

అమెరికా వైఖరే ఈ దాడులకు కారణం !

- క్యూబా దౌత్య కార్యాలయంపై దాడిని ఖండించిన బ్రూనో రొడ్రిగజ్

హవానా : ఆదివారం సాయంత్రం అమెరికాలోని క్యూబన్ దౌత్య కార్యాలయంపై పెట్రోల్ బాంబులతో దాడి జరిగింది. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించే గ్రూపుల పట్ల కఠిన చర్యలు తీసుకోవడంలో అమెరికా అధికారులు విఫలమయ్యారని క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే ఈ దాడిలో ఎవరూ గాయపడలేదని మంత్రి చెప్పారు. ఇంకా పూర్తి స్థాయి వివరాలు తెలియాల్సి వుందన్నారు. తమకు అమెరికా ప్రభుత్వం నుండి రక్షణ అందుతుందని భావించినప్పుడు క్యూబా వ్యతిరేక గ్రూపులు ఇటువంటి తీవ్రవాదానికి పాల్పడతాయని, దీని గురించే క్యూబా ఎప్పుడూ హెచ్చరిస్తూ వుంటుందని ఆయన పేర్కొన్నారు. క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్‌తో సహా ప్రపంచ నేతలందరూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు హాజరైన సమయంలోనే ఈ దాడి చోటు చేసుకోవడం గమనార్హం. 2020 ఏప్రిల్‌లో కూడా ఇలాగే క్యూబా దౌత్య కార్యాలయంపై దాడి జరిగిన విషయాన్ని రొడ్రిగజ్ గుర్తు చేసుకున్నారు. అమెరికా అనుసరించే క్యూబా వ్యతిరేక విధానాల కారణంగానే ఈ దాడులు జరుగుతున్నాయని అన్నారు. క్యూబాలోని సోషలిస్టు ప్రభుత్వాన్ని వ్యతిరేకించే అమెరికా తమ దేశంపై, ప్రభుత్వంపై అనేక ఆంక్షలు పెడుతోందన్నారు. తమ దేశంపై సాగే ప్రచారానికి అమెరికా ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. అమెరికా అనుసరించే వైఖరే వారిని ఇటువంటి దాడులకు తెగబడేలా చేస్తోందన్నారు.

2025 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా !

- ఇవో మొరేల్స్ ప్రకటన

లాపాజ్ : ఘర్షణల నేపథ్యంలో నాలుగేళ్ళ క్రితం అధికారం నుండి పదవీచ్యుతుడైన వామపక్షవాది, బొలీవియా మాజీ అధ్యక్షుడు ఇవో మొరేల్స్ వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నాలుగోసారి పోటీ చేయాలంటూ తన మద్దతుదారులు కోరుతున్నారని, వారి అభ్యర్ధనను అంగీకరిస్తానని చెప్పారు. "నేను చేయగలిగినదంతా చేస్తాను. ఇప్పటికీ మనకు బలం వుంది. మనపై జరుగుతున్న దురాక్రమణను వాస్తవాలు, నిజాయితీతో ఎదుర్కొనాలని భావిస్తున్నా" అని ఆయన ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. 2006లో మొదటిసారిగా అధ్యక్షుడిగా ఎన్నికైన మొరేల్స్ 2019లో బలవంతంగా గద్దె దిగాల్సి వచ్చింది. దేశంలో అశాంతి చెలరేగిన తరుణంలో దేశం వీడి వెళ్లాల్సి వచ్చింది. అమెరికా ఆదేశాలతోనే తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నారని ఆయన విమర్శించారు.

పార్టీని ఔట్‌సోర్సింగ్‌కి ఇచ్చేసారు

- కాంగ్రెస్‌పై మోడీ విసుర్లు

భోపాల్ : కాంగ్రెస్ పార్టీని ప్రస్తుతం ఆ పార్టీ నేతలు నడపడం లేదని, పట్టణ ప్రాంతం (ఆర్బన్) నక్సల్స్‌కు ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. భోపాల్‌లో కార్యకర్త మహాకుంభ్ కార్యక్రమంలో మోడీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌కు మరోసారి అవకాశం ఇస్తే మధ్యప్రదేశ్‌ను బీమారు (వెనుకబాటుతనం) లోకి నెడుతుందని అన్నారు. కాంగ్రెస్ సంకల్ప బలం కోల్పోయిందని, ఆ పార్టీ కార్యకర్తలు మౌన ప్రేక్షకుల్లా మిగిలారని విమర్శించారు. అలాగే వేరే గత్యంతరం లేక కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును విముఖతతోనే ఆమోదించాయని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. వారికే మాత్రం అవకాశం దొరికినా కచ్చితంగా మహిళా బిలుపై వెనక్కి తగ్గేవారని అన్నారు. కాంగ్రెస్‌ను తుప్పుపట్టిన ఇనుముతో పోల్చారు, ముందుగా ఎన్నికల్లో దెబ్బతిన్న కాంగ్రెస్, తర్వాత మొత్తంగా దివాళా తీసిందని అన్నారు.

ఎన్ఐఎ కోర్టుకు హాజరైన సాధ్వి ప్రజ్ఞాసింగ్

ముంబయి : మాలెగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితురాలైన బిజెపి ఎంపి సాధ్వి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ సోమవారం ముంబయిలోని ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసులో ఏడవ నిందితురాలైన ఆమె మధ్యాహ్నం రెండు గంటలకు కోర్టుకు వచ్చారు. ఈ కేసులోని మిగిలిన నిందితులు కోర్టుకు హాజరైన దాదాపు రెండు గంటల తర్వాత ఆమె వచ్చారు. తనకు కొన్ని అనారోగ్య సమస్యలు వున్నాయని, అందువల్లే పొద్దునే రాలేకపోయానని ఆమె కోర్టుకు తెలియచేశారు.

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ

తాడిగడప బ్రాంచి (11931) పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా - 521137

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప శాఖ అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన** దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప శాఖ వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 13-10-2023న** ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

1) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీమతి గంగం మమత, భర్త : గంగం శ్రీనివాసరెడ్డి, 3-14, బంజారుపల్లి, పందిళ్ళ, హుస్నాబాద్ మండలం, సిద్ధిపేట జిల్లా, తెలంగాణ-505467. **2) శ్రీ కాజా గోపీకృష్ణ,** తండ్రి : రామమోహనరావు, డి.నెం. 54-20-11/1, గౌరంగబాబు వీధి, శ్రీనగర్ కాలనీ, విజయవాడ-520008
బకాయి మొత్తం : శ్రీమతి గంగం మమత గారు తీసుకున్న లోన్ తాలూకు డిమాండ్ నోటీసు తేది 05-05-2021 ప్రకారం బకాయి **రూ. 31,44,708/-** మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : శ్రీమతి గంగం మమత, భర్త : గంగం శ్రీనివాసరెడ్డి గారి పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, గూడవల్లి గ్రామం & గ్రామ పంచాయితీ, డి.నెం. 2-136 వద్ద అవిభక్త వాటా 54.25 చ॥గ॥లతో కలిపి 1923 చ॥గ॥ విస్తీర్ణంలో నిర్మించిన సాయి నివాస్ అపార్ట్‌మెంట్ నందు నాల్గవ అంతస్తులో 1022 చ॥అ॥ ప్లింత్ ఏరియా విస్తీర్ణంలోని ఫ్లాట్ నెం. 506. **ఆస్తి / ఫ్లాట్ కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** 7.10 అ॥ వెడల్పు కామన్ కారిడార్ మరియు మెట్లు, **ఉత్తరం :** శూన్యాకాశము మరియు లిఫ్ట్.

రిజర్వు ధర : రూ. 22,50,000/- ధరావత్తు : రూ. 2,25,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

2) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీ కోటం వినోద్‌కుమార్ రెడ్డి, తండ్రి : రమణారెడ్డి, 1-73, రాచయ్యపేట, గోపవరం, గోపవరం ప్రాజెక్ట్ సైట్, కడప-516233. **2) శ్రీమతి శారదా బోడేపూడి,** భర్త : బోడేపూడి వెంకటరావు, ఫ్లాట్ నెం. 505, డి.నెం. 2-29, సాయి నివాస్ అపార్ట్‌మెంట్స్, గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్ - 521104
బకాయి మొత్తం : శ్రీ కోటం వినోద్ కుమార్ రెడ్డి గారు తీసుకున్న లోన్ తాలూకు డిమాండ్ నోటీస్ తేది 05-05-2021 ప్రకారం బకాయి **రూ. 25,46,203/-** మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : శ్రీ కోటం వినోద్ కుమార్ రెడ్డి, తండ్రి : రమణారెడ్డి గారి పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, గూడవల్లి గ్రామం & గ్రామ పంచాయితీ, డి.నెం. 2-136 వద్ద అవిభక్త వాటా 54.25 చ॥గ॥లతో కలిపి 1923 చ॥గ॥ విస్తీర్ణంలో నిర్మించిన సాయి నివాస్ అపార్ట్‌మెంట్ నందు మూడవ అంతస్తులో 1022 చ॥అ॥ ప్లింత్ ఏరియా విస్తీర్ణంలోని ఫ్లాట్ నెం. 406. **ఆస్తి / ఫ్లాట్ కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** కామన్ కారిడార్ మరియు మెట్లు, **ఉత్తరం :** శూన్యాకాశము మరియు లిఫ్ట్.

రిజర్వు ధర : రూ. 22,50,000/- ధరావత్తు : రూ. 2,25,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. **అధీకృత అధికారి** గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తులపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **మొబైల్ నెం. 8867673939, MailID: ubin0811939@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 19-09-2023
ప్రదేశం : తాడిగడప
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప బ్రాంచి

ICICI Home Finance

కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, అంధేరి -కుర్లా రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ధ వారసులు. లోను ఖాతా నం.	ఏవైనా తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్థి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	కట్టమూరి ఏడుకొండలు (రుణగ్రహీత), కట్టమూరి కీర్తి (సహ రుణగ్రహీత), కట్టమూరి ప్రమీల (రుణగ్రహీత) లోను ఖాతా నం.: LHGTR00001336715 & LHGTR00001336732	ఫ్లాట్ నం. జి1, గ్రౌండ్ ఫ్లోర్, కకుమను టవర్స్, ఎస్ వి కె డెవలపర్స్, డో నం.522ఎ, ఫ్లాట్ నం.7,8,9,10, నరనరావుపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522601.	Rs. 23,36,042/- September 21, 2023	Rs.18, 89,933/- / Rs. 1,89, 000/-	October 03, 2023 11:00 AM- 03:00 PM	October 13, 2023 02:00 PM- 03:00 PM

మా వేలం ఏజెన్సీ గ్లోబ్‌టెక్ వెబ్‌సైట్ (**URL Link-https://BestAuctionDeal.com**) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. అక్టోబర్ 12, 2023న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.
కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా అక్టోబర్ 12, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా అక్టోబర్ 12, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి గుంటూరు వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను లేదా మా సేల్స్ అండ్ మార్కెటింగ్ పాట్నర్ నెక్సెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.
అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, **https://www.icicihfc.com/** దయచేసి చూడండి..

తేది: సెప్టెబర్ 26, 2023
ప్రదేశం: గుంటూరు

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
ఆంధ్ర లయోలా కాలేజీ క్యాంపస్ బ్రాంచ్-1531
విజయవాడ, ఆంధ్రప్రదేశ్, పిన్-520008. ☎ 0866-2476810

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం. 54) క్రింద బ్యాంకుకు తనఖాపెట్టిన స్థిరాస్థుల అమ్మకము. ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్** అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను **''ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే'' & ''ఏది ఉంటే అది''** అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందాఆరు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయిసొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ **https://www.mstcecommerce.com/auctionhome.ibapi.** నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీతల పేర్లు & చిరునామా: మెస్సర్స్ సెవెన్ స్టార్ ట్రేడింగ్ కంపెనీ, యజమాని: తొండెపు నాగశ్రీ, 2/37, 1వ అంతస్తు, M..G.W.C. కాంప్లెక్స్, గొల్లపూడి, విజయవాడ, కృష్ణా, ఎపి-521225. **యజమాని: శ్రీమతి తొండపు నాగశ్రీ యస్ రావు,** డి.నెం.21-25/15, ఫ్లాట్ నెం. FF5, 1వ అంతస్తు, వినాయక టవర్స్, గొల్లపూడి, విజయవాడ, కృష్ణా, ఎపి-521225. **హామీదారుల పేరు & చిరునామా: 1) శ్రీ భూమ వెంకటేశ్వర ప్రసాద్,** డి.నెం. 29-23-28, CO ముసిన్‌శర్మ, సూర్యారావుపేట, తాడేపల్లివారి స్ట్రీట్, అరుణ్ కిడ్నీ సెంటర్ ఎదురు, విజయవాడ-520002 (తనఖాదారు). **2) శ్రీ తొండెపు దుర్గా శ్రీనివాసరావు,** డి.నెం.21-25/15, ఫ్లాట్ నెం.FF-5, 1వ అంతస్తు, వినాయక టవర్స్, గొల్లపూడి, విజయవాడ-521225.

NPA తేది: 24-10-2022 — **డిమాండ్ నోటీసు తేది: 03-11-2022**

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.31-10-2022 నాటికి రూ.13,48,963/- (అక్షరాల పదమూడు లక్షల నలభై ఎనిమిది వేల తొమ్మిది వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 19-01-2023

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.31-12-2022 నాటికి రూ.13,77,123/- (అక్షరాల పదమూడు లక్షల డెబ్బైఏడు వేల నూట ఇరవై మూడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

***ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజీ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.**

స్థిరాస్తి యొక్క వివరములు
ఆస్తి (ఎ): ఆస్తి యొక్క వివరణ: కృష్ణా జిల్లా-521101, గన్నవరం సబ్-రిజిస్ట్రీ, బాహుబలేంద్రునిగూడెం గ్రామపంచాయతీ, బాహుబలేంద్రునిగూడెం గ్రామము, ఆర్.యస్.నెం.79 నందు **శ్రీ భూమ వెంకటేశ్వర ప్రసాద్, తండ్రి: లేటు సుబ్బారాయుడుకు సొంతమైన** 200 చ॥గ॥ లేదా 168.00 చ॥మీ॥ విస్తీర్ణముగల ఖాళీ స్థలము ఫ్లాట్ నెం.53 నకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు: తూర్పు:** 40 అ॥ వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** అమ్మకందారునికి చెందిన ఆస్తి ఫ్లాట్ నెం.52; **పడమర:** ఫ్లాట్ నెం.62 ఆస్తి; **ఉత్తరం:** ఫ్లాట్ నెం.54 ఆస్తి.
ఆస్తి (బి): ఆస్తి యొక్క వివరణ: కృష్ణా జిల్లా-521101, గన్నవరం సబ్-రిజిస్ట్రీ, బాహుబలేంద్రునిగూడెం గ్రామపంచాయతీ, బాహుబలేంద్రునిగూడెం గ్రామము, ఆర్.యస్.నెం.79 నందు **శ్రీ భూమ వెంకటేశ్వర ప్రసాద్, తండ్రి: లేటు సుబ్బారాయుడుకు సొంతమైన** 200 చ॥గ॥ లేదా 168.00 చ॥మీ॥ విస్తీర్ణముగల ఖాళీ స్థలము ఫ్లాట్ నెం.62 నకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు: తూర్పు:** అమ్మకందారునికి చెందిన ఆస్తి ఫ్లాట్ నెం.53; **దక్షిణం:** అమ్మకందారునికి చెందిన ఆస్తి ఫ్లాట్ నెం.63; **పడమర:** 40 అ॥ వెడల్పుగల రోడ్డు; **ఉత్తరం:** ఫ్లాట్ నెం.61 ఆస్తి. **ఎ&బి ఐటమ్స్ కలిపి మొత్తం విస్తీర్ణము: 400 చ॥గ॥.**

రిజర్వుధర: రూ.14,40,000/- ధరావత్తు ధర: రూ.1,45,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.25,000/-

ఇ-వేలం తేది మరియు సమయం: తేది.12-10-2023, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://www.mstcecommerce.com/auctionhome/ibapi ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 10 ని॥లకు ఒకసారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం: ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి **https://www.mstcecommerce.com/auctionhome/ibapi** పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తిగల బిడ్డర్లు / కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని **11.10.2023, సాయంత్రం 4.00 గంటలలోపు బదిలీ చేయవలెను.** ఆసక్తిగల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామా కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి జంఝాటములు (ఎన్‌కంబరెన్స్) : అన్ని ఆస్తులకు నిల్

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం: ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది. 26.09.2023 నుండి

ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది: 11.10.2023, సా॥ 4.00 గం॥ల వరకు

***చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.**

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్: **(1) https://www.ibapi.in (2) https://www.mstcecommerce.com/auctionhome/ibapi** లేదా **(3)** బ్యాంక్ వెబ్‌సైట్ **www.iob.in** మరిన్ని వివరముల కొరకు ఆఫీస్ పనివేళల్లో: **బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఆంధ్ర లయోలా కాలేజీ బ్రాంచి, రమేష్ హాస్పిటల్ దగ్గర, విజయవాడ-520008, ఫోన్: 0866-2486140 & 2476810,** సర్వీస్ ప్రొవైడర్: **M/s. MSTC లిమిటెడ్,** రిజిస్టర్డ్ ఆఫీస్: 225-సి, ఎ.జె.సి.బోస్ రోడ్డు, కోల్‌కత్త-700020, **(టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 033-22901004, హెల్ప్‌డెస్క్ పనిచేయు సమయం: ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు)** వారిని సంప్రదించగలరు.

తేది: 25.09.2023, ప్రదేశము : విజయవాడ — **సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్**

తిరుపతి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసనలో పాల్గొన్న సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పి.మధు



ఇబ్రహీం పట్నం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిపిఎం నేతలకు మద్దతు తెలుపుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, తదితరులు

విజయవాడలో ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్వాడీలు

విజయవాడ దిశ పోలీస్‌స్టేషన్‌లో బేబిరాణి, తదితరులు

నిరసనలపై నిర్బంధకాండ

అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధకాండకు పూనుకుంది. మహాధర్నాకు రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవడంతోపాటు విజయవాడ చేరుకున్న వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేసి, బస్సుల్లో బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తరలించారు.



అక్రమంగా అరెస్టు చేసిన అంగన్వాడి మహిళలను సింగ్‌నగర్ గంగానమ్మ దేవస్థాన కళ్యాణమండపంలో నిర్బంధించారు

అంగన్వాడీలకు మద్దతుగా విజయవాడలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, బాబూరావు, వి వెంకటేశ్వర్లు తదితరులు

అనంతపురం కలెక్టరేట్ ఎదుట సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్తుండగా పోలీసు వాహనాన్ని అడ్డుకున్న అంగన్‌వాడీలు

బాలోత్సవ భవన్ మీడియా సమావేశంలో అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న సిఐటియు నాయకులు సిహెచ్ నర్సింగరావు తదితరులు

పుస్తకం విలువ



'స్టీఫెన్ ఇలాగేనా నీ చదువు' అని మరియమ్మ అడిగింది. 'అలా ఎందుకు అడుగుతున్నావు అమ్మమ్మ!' అని స్టీఫెన్ అడిగాడు. 'నీ పుస్తకాల సంచి చూశాను. ఏ ఒక్క పుస్తకం కూడా సరిగా లేదు. అట్టలన్నీ చిరిగిపోయి ఉన్నాయి. చిత్తు కాగితాల సంచిలా, నీ పుస్తకాల సంచి ఉంది' అని అసలు విషయం చెప్పింది.

'అమ్మమ్మ! పుస్తకాలు చిరిగిపోయాయి. నేనేం చేస్తాను' అన్నాడు స్టీఫెన్.

'నీ పుస్తకాలను చూసి నీ చదువు గురించి చెప్పొచ్చు. నీకు ఏమాత్రం పుస్తకాలపై శ్రద్ధ లేదు. చదువుపై శ్రద్ధ ఉండకపోవటమే అందుకు కారణం. పుస్తకాలను చాలా చక్కగా ఉంచుకోవాలి. అప్పుడే చదువు కూడా చక్కగా సాగుతుంది' అని మరియమ్మ అంది.

'అమ్మమ్మ! ఎందుకు నువ్వు అంతలా కోప్పడుతున్నావు? ఆ పుస్తకాలు ఏమైనా డబ్బులు పెట్టి కొనుగోలు చేసామా? పాఠశాలలో ఉచితంగా ఇచ్చినవే కదా! అవి చిరిగిపోతున్నాయని ఎందుకు అంత బాధ పడిపోతున్నావ్' అని చాలా నిర్లక్ష్యంగా స్టీఫెన్ సమాధానం చెప్పాడు.

అప్పుడు మరియమ్మకు చాలా కోపం వచ్చింది. 'ఉచిత పుస్తకాలు అంటే నీకు అంత చిన్న చూపుగా ఉందా! ఈ పుస్తకాలు బయట కొంటే ఖరీదు ఎంత అవుతుందో తెలుసా? మా చిన్నతనంలో పుస్తకాలు దొరక్క, మేము మా పై తరగతుల వారిని బతిమాలి ఆ పాత పుస్తకాలు తీసుకునే వాళ్ళం. వాటికి అట్టలు వేసుకుని సంవత్సరం అంతా జాగ్రత్తగా చదివే వాళ్ళం. పుస్తకం ఎంతో విలువైనది. ఖరీదుతో సంబంధం లేదు' అని స్టీఫెన్‌తో అంది. ఎప్పుడూ తనపై కోపగించుకోని అమ్మమ్మ చాలా కోపంగా ఆ మాటలు అంటుంటే స్టీఫెన్ తట్టుకోలేకపోయాడు. వెంటనే అమ్మమ్మ దగ్గరకు వెళ్లి, 'నన్ను క్షమించమ'ని అడిగాడు. 'ఇకపై పుస్తకాలను చక్కగా వాడుకుంటాను. బాగా చదువుకుంటాను' అని అన్నాడు.

స్టీఫెన్‌లో వచ్చిన మార్పుకు మరియమ్మ ఎంతో ఆనందం పడింది.

- మొర్రి గోపి
88978 82202



కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ గడుల్లో ఇచ్చిన అంకెల ఆధారంగా కొన్ని సమాధానాలు ఇచ్చాం. ఖాళీ గడిలో ఉన్న అంకెను మీరు కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

- బి.అశోక్,
9వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ ముత్యాలపేట,
కవిటి మండలం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

క్రికెట్‌లో స్వర్ణం

మహిళా జట్టు నయా చరిత్ర

ఫైనల్లో శ్రీలంకపై 19పరుగుల తేడాతో గెలుపు

ఆసియా క్రీడల్లో 11పతకాలతో 6వ స్థానం

10మీ. ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు తొలి స్వర్ణం అందించిన షూటర్లు

హాంగ్జౌ: భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో తొలిసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న మహిళల జట్టుగా నిలిచింది. హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సోమవారం జరిగిన ఫైనల్లో శ్రీలంకపై 19పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత టాస్ గెలిచిన భారతీయ మహిళల జట్టు.. ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నది. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. స్మృతి మంధానా(46), జెమీమా రోడ్రిగ్స్(42) బ్యాటింగ్‌లో రాణించారు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన లంక మహిళల జట్టును భారత బౌలర్లు దెబ్బతీశారు. టిటాస్ సాధుకు మూడు, రాజేశ్వరీ గౌక్వాడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. శ్రీలంక జట్టులో హాసిని పెరీరా(25), నీలాక్షి డిసిల్వా(23) టాప్ స్కోరర్స్. దీంతో లంక మహిళల జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 97పరుగులు మాత్రమే చేసింది. దీంతో 19పరుగుల తేడాతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన విజయం సాధించింది. స్వర్ణం సాధించిన భారత మహిళా క్రికెటర్లకు భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు) ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపింది.

ఎయిర్‌రైఫిల్‌లో రికార్డు స్వర్ణం

ఎయిర్ రైఫిల్ 10మీటర్ల విభాగంలో భారత్ ప్రపంచ రికార్డు నెలకొల్పింది. రుద్రాంక్ష్ పాటిల్, దివ్యాన్ష్, తోమర్‌తో కూడిన బృందం ఫైనల్లో 1893.7పాయింట్లను నమోదు చేసింది. దీంతో గతంలో చైనా చేసిన 1893.3 పాయింట్ల రికార్డును అధిగమించింది. దీంతో భారత్ పతకాల పట్టికలో తొలి స్వర్ణం జమ అయ్యింది. 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ విభాగంలో జట్టుగా స్వర్ణం గెలిచిన రుద్రాంక్ష్, దివ్యాన్ష్, తోమర్ వ్యక్తిగతంగానూ ఫైనల్‌కు చేరుకున్నారు. థోమర్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఫైనల్ కోసం జరిగిన పోటీల్లో రుద్రాంక్ష్ మూడో స్థానం, తోమర్ ఐదోస్థానం, దివ్యాన్ష్ ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. పురుషుల రోయింగ్-4 ఈవెంట్‌లోనూ భారత్ కాంస్య పతకం దక్కింది. రెండోరోజు ఆసియా క్రీడల పోటీలు ముగిసే సరికి భారత్ 11 పతకాలతో 5వ స్థానంలో నిలిచింది.

టాప్ సీడ్ రోహన్ బోపన్న జోడీకి షాక్..

టెన్నిస్ పురుషుల డబుల్స్‌లో టాప్‌సీడ్ రోహన్ బొప్పన్న, యుకీ బాంబ్రీకి షాక్ తగిలింది. తమ కంటే తక్కువ ర్యాంక్ ప్లేయర్ల చేతిలో రెండో రౌండ్‌లో ఓడిపోయారు. సోమవారం జరిగిన రెండోరౌండ్‌లో ఉజ్బెకిస్థాన్ ద్వయం సెర్గే ఫొమిన్, ఖుమోయున్ సుల్తానోవ్.. చేతిలో బోపన్న, బాంబ్రీ పరాజయాన్ని చవిచూశారు. మ్యాచ్ ఆఖర్లో బాంబ్రీ సర్వీస్ చేసేందుకు ఇబ్బంది పడ్డాడు. దాంతో భారత జంట 2-6, 6-3, 10-6 పాయింట్ల తేడాతో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మహిళల డబుల్స్‌లో రుతుజా భోసలే, కర్మాన్ థాండీ బోణీ కొట్టారు. కజకిస్థాన్‌కు చెందిన ఝునెల్ రస్తెమోవ, అరుజాన్ సగండికోవాపై రుతుజా, కర్మాన్ 6-4, 6-2తో గెలుపొందారు. ఈ మ్యాచ్ సుమారు 93 నిమిషాల పాటు సాగింది.

100మీ. పురుషుల బ్రెస్ట్ స్ట్రోక్ ఫైనల్లో లికిత్ సెల్వెరాజ్ నిరాశపరిచాడు. సోమవారం జరిగిన 8మంది స్విమ్మర్లు పాల్గొన్న ఫైనల్లో లికిత్ 1.01:62సెకన్లతో 7వ స్థానంలో నిలిచాడు. ఇందులో చైనాకు చెందిన క్విన్ హల్‌యంగ్ 57.76సెకన్లతో ఆసియా గేమ్స్‌లో రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక 50మీ. బ్యాక్‌స్ట్రోక్‌లో ఒలంపియన్ శ్రీహరి నటరాజ్ 25.39సెకన్లలో గమ్యానికి చేరి ఫైనల్‌కు చేరాడు. ఈ రౌండ్‌లో చైనాకు చెందిన క్యూ-జిహూ 24.38సెకన్లు అగ్రస్థానంలో నిలిచాడు. వుషూ పురుషుల 60కిలోల విభాగంలో సూర్యభాను క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన మూడురౌండ్ల పోటీలో సూర్యకుమార్ 2-1తో ఇస్లోంబెక్(ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించాడు.బాక్సింగ్ పురుషుల 46-51కిలోల విభాగంలో దీపక్, విజయం సాధించాడు. మలేషియాకు చెందిన మహ్మద్ అబ్దుల్‌పై యునానిమస్ డెసిషన్‌లో గెలిచాడు.

పతకాల పట్టిక

వ.స.	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	39	21	9	69
2.	కొరియా	10	10	13	33
3.	జపాన్	5	14	12	31
4.	ఉజ్బెకిస్తాన్	4	4	6	10
5.	హాంకాంగ్	3	4	7	14
6.	ఇండియా	2	3	6	11
7.	చైనీస్ తైపీ	2	1	3	6
8.	ఇండోనేషియా	1	1	4	6
9.	థాయ్‌లాండ్	1	0	2	3
10.	మకావు	1	0	1	2

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

తొలిరోజు నుంచే చైనా హవా..

20 స్వర్ణాలతో అగ్రస్థానం.. 2024 ఒలింపిక్స్ బెర్త్‌లే లక్ష్యం

డబుల్ స్కల్స్‌లో చైనాకు తొలి స్వర్ణం అందించిన మహిళా రోవర్లు

హాంగ్జౌ: 19వ ఆసియా క్రీడల్లో ఆతిథ్య చైనా తన హవా తొలిరోజు నుంచే చాటుతోంది. 40ఏళ్లుగా ఆసియా క్రీడల్లో మకుటంలేని మహారాజుగా వెలుగొందుతున్న చైనా.. తొలిరోజు ఆటలు ముగిసే సరికి ఏకంగా 20స్వర్ణాలతో సహా మొత్తం 30 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. మహిళల లైట్‌వెయిట్ డబుల్ స్కల్స్‌లో చైనా తొలి స్వర్ణ పతకాన్ని ముద్దాడి ఈసారి పతకాల వేటను మొదలు పెట్టింది. పెంటథ్లాన్(2), ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్(1), రోయింగ్(6), షూటింగ్(2), వుషూ(2), స్విమ్మింగ్(7) స్వర్ణాలను చైనా తొలిరోజు కైవసం చేసుకుంది. 200మీ. బటర్‌ఫ్లైలో జాంగ్ యుఫీ వ్యక్తిగత విభాగంలో తొలి బంగారు పతకాన్ని ముద్దాడింది. జపాన్‌లోని ఫుకుయోకాలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి ఆమె తొలిసారి ఆసియా క్రీడల్లో చైనాకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇక దక్షిణ కొరియా జట్టు తొలిరోజు ఐదు స్వర్ణాలతో సహా 14 పతకాలతో రెండోస్థానంలో నిలిచింది. పెంటాథ్లాన్, తైక్వాండోలో రెండేసి, ఫెన్సింగ్‌లో ఒక స్వర్ణం దక్షిణ కొరియా దక్కాయి. హాంకాంగ్ పురుషుల జట్టు ఒక స్వర్ణాన్ని సాధించగా.. ఫెన్సింగ్ వ్యక్తిగత విభాగంలోనూ ఆ జట్టుకు మరో బంగారు పతకాన్ని ఖాయం చేసింది. అలాగే తైవాన్, ఉజ్బెకిస్తాన్‌లకు తొలిరోజు ఒక్కో బంగారు పతకాలు దక్కాయి.

ఆతిథ్య దేశం పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిస్తే హోమ్ ఫీల్డ్ మెడల్ కూడా దక్కనుంది. ఈ క్రీడల్లో సత్తా చాటి 2024 పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడమే ప్రధాన లక్ష్యంగా చైనా అథ్లెట్లు బరిలోకి దిగారు. రెండోరోజు పోటీలు ముగిసేసరికి చైనా 39స్వర్ణ, 21రజిత, 9 కాంస్యాలతో సహా మొత్తం 69 పతకాలతో మిగతా దేశాలకు అందనంత ఎత్తులో నిలిచింది. ఇక ఐదేళ్ల క్రితం ఇండోనేషియాలోని జకార్తా వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో చైనా 132 స్వర్ణాలతో సహా 300 పతకాలు చేజిక్కించుకొని అగ్రస్థానంలో నిలి చింది. ఆ తర్వాత జపాన్, దక్షిణ కొరియా నిలిచాయి. చైనా వేదికగా జరిగే 19వ ఆసియా క్రీడల్లో 45దేశాల నుంచి 12,500కు పైగా అథ్లెట్లు పాల్గొంటున్నారు. వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో 200 మంది అధికారులు 10,500మంది అథ్లెట్లు కంటే ఇది అధికం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68